



రేడియేషన్... రెడ్ అలర్ట్

- ప్రమాదకరస్థాయిలో యూవీ కిరణాలు
- ఉమ్మడి గుంటూరుపై అతినీలలోహిత కిరణాల పడగ
- ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికంగా
- జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పేనంటున్న వైద్య నిపుణులు

10 యూవీ అంటే ప్రమాదకరమే

వాతావరణంలో అతినీలలోహిత కిరణాలు 2 యూనిట్ల లోపు ఉంటే సాధారణ స్థాయిగా గుర్తిస్తారు. 3 నుంచి 5 లోపు ఉంటే మధ్యస్థంగా, 6-7 మధ్య ఉంటే అధికంగా ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గుర్తిస్తుంది. ఇక 8 నుంచి 10 వరకు ఉంటే అత్యధిక స్థాయిలో ఉన్నట్లు గుర్తించడంతో పాటు ప్రమాదకరమని రెడ్‌అలర్ట్ ప్రకటిస్తారు.



వణికిస్తున్న యూవీ కిరణాలు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నుంచి పగలు ఎండలు మండుతున్నాయి. రాత్రిల్లు మంచుతో పాటు చలిగాలులు వీచాయి. ఈ విచిత్రమైన వాతావరణ పరిస్థితులతో పలువురు అనారోగ్యాలకు గురయ్యారు. ఉన్నట్టుండి వాతావరణంలో చోటు చేసుకుంటున్న విపరీత మార్పులపై ప్రజల్లోనూ భాయాందోళన నెలకొంది. ఈ వేసవిలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికస్థాయిలో అతి నీలలోహిత కిరణాలు ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గుర్తించింది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య ఈ కిరణాల తీవ్రత అధికంగా ఉంటోందని హెచ్చరికలు జారీ చేసింది. అతినీలలోహిత కిరణాల్లో ఉండే రేడియేషన్ మనుషుల్లో పలు రకాల ఆరోగ్య సమస్యలకు కారణమౌతుంది. ముఖ్యంగా వడదెబ్బ, సన్‌బర్న్, కంటి శుక్లాలు, చర్మం ముడతలు పడటం వంటి సమస్యలతో పాటు కొన్నిసార్లు చర్మ కేన్సర్లకు అతి నీలలోహిత కిరణాలు కారణమౌతాయి. యూవీ కిరణాల తీవ్రత అధికంగా ఉన్నప్పుడు జనాలు ఎండలో ఎక్కువ సేపు తిరిగితే సొరియాసిస్, బొల్లి రోగుల్లో ఎండ పడిన శరీర భాగాల్లో వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. కొద్ది రోజులుగా పగటి వాతావరణంలో యూవీ కిరణాల తీవ్రత పెరుగుతోంది. ముఖ్యంగా గత మూడు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాతావరణంలో 10 యూవీ రేడియేషన్ యూవీ కిరణాలు వెలువడినట్లు వాతావరణ శాఖ గుర్తించింది.

వీరు జాగ్రత్తగా ఉండాల్సిందే...

తక్కువ తరంగ దైర్ఘ్యం కలిగి ఉండటం వల్ల అతి నీలలోహిత కిరణాలు దృశ్యకాంతి కంటే అధికంగా చర్మలోతుల్లోకి చొచ్చుకొని పోగలవు. శరీర కణాల్లో డీఎన్ఏను దెబ్బతీసే సామర్థ్యం వీటికి ఉంటుంది. ఈ కారణంగా ఈ కిరణాల నుంచి రక్షణ కోసం బహిరంగ ప్రదేశాల్లో తిరిగే వారు, బైకర్లు, ఎండలో పని చేసే వారు, మత్స్యకారులు, పర్యాటకులు, కంటి, చర్మవ్యాధులు ఉన్న వారు, పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లే సమయంలో పొడుగు చేతుల దుస్తులు, టోపీ ధరించడం, కళ్లద్దాలు ధరించడం శ్రేయస్కరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. 'ఎండలో తిరిగే వారు సన్ స్క్రీన్ లోషన్ వాడనవసరం లేదు. శరీరంలో ఉండే మెలనిన్ రక్షణగా నిలుస్తుందని.' సీనియర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ డీవీఎస్‌బీ రామ్మూర్తి తెలిపారు. సొరియాసిస్, బొల్లి వంటి చర్మవ్యాధుల ఉన్న వారు ఎండలో ఉండే యూవీ కిరణాల్లో ఎక్కువ సేపు తిరిగితే వారిలో వ్యాధి తీవ్రత మరింత పెరుగుతుందన్నారు.

సన్‌బర్న్ కేసులు వస్తున్నాయి...



వాతావరణంలోని అతి నీలలోహిత కిరణాల తీవ్రత కారణంగా గుంటూరు ప్రభుత్వ సమగ్రా స్పత్రి చర్మవ్యాధుల వైద్య విభాగానికి సన్ బర్న్ రోగులు చికిత్సల కోసం వస్తున్నారు. ఎండలో తిరిగే వారు సూర్యరశ్మి చర్మంపై పడకుండా తగిన దుస్తులు ధరించాలి. అధికంగా మంచినీరు, ఇతర ద్రవ పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఎండలో తిరిగిన వారు అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే నీడ పట్టున కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి.

- డాక్టర్ లక్ష్మి, జీజీహెచ్ డెర్మటాలజిస్ట్



శాస్త్రోక్తంగా సీఎం ఇంటి భూమిపూజ

మనవడు దేవాన్ష్‌తో కలిసి పూజ చేస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు

హోమం చేసిన సీఎం దంపతులు

లోకేశ్, బ్రాహ్మణికి పట్టువస్త్రాలు పెట్టిన రైతులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల వెలగపూడిలో తీసుకున్న స్థలంలో ఇంటి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. అధికారిక హోదాలో ఎలాంటి హడావుడి లేకుండా పరిమిత సంఖ్యలోనే ఆహ్వానితులు, బంధుమిత్రుల సమక్షంలో శంకుస్థాపన జరిగింది. ఉదయం 7 గంటలకు ఉండవల్లిలోని ప్రస్తుత నివాసం నుంచి కుటుంబ సభ్యులంతా వెలగపూడిలోని తమ ఇంటి స్థలం వద్దకు చేరుకున్నారు. ఉదయం 8గంటల 51 నిమిషాలకు చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, తమ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్‌తో కలిసి, పునాదుల్లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, నిర్మాణాన్ని ప్రారంభించారు. మనవడు దేవాన్ష్‌ను ఒళ్లో కూర్చోబెట్టుకుని సీఎం చంద్రబాబు క్రతువులు నిర్వహించారు.

● అపూర్వ స్వాగతం పలికిన రైతులు

ఇంటి శంకుస్థాపనకు వస్తున్న సీఎం కుటుంబ సభ్యులకు అమరావతి రైతులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. తమను ఆహ్వానిస్తే అందరూ రావాలనుకున్నామని, పరిమిత సంఖ్యతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో తామూ పరిమితంగానే రావాల్సి వచ్చిందని చాలామంది రైతులు వాపోయారు. అయినప్పటికీ తమ సంతోషాన్ని తెలియజేయడం కోసం అమరావతి మహిళలు రంగవల్లులతో ఆహ్వానం పలికారు. స్వాగత ద్వారం నుంచి హోమగుండం వరకూ ముగ్గులు వేసి, అందంగా రంగులు అద్ది నారావారి కుటుంబానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు రాజధాని రైతులు పట్టు వస్త్రాలు బహూకరించారు. చంద్రబాబు కొనుగోలు చేసిన స్థల యజమాని కంచర్ల సాంబశివరావు ఆయన భార్య, మాజీ సర్పంచ్ శాంతకుమారి, కుమార్తె గీత(చిన్న) ఇద్దరు యువ దంపతులకు పట్టు వస్త్రాలు పెట్టారు.



మంత్రి లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న స్థల యజమాని కుమార్తె గీత



సిమెంట్ సిండికేట్



- బస్తాకు రూ.90 పెరుగుదల
- దూసుకుపోతున్న ఇనుము ధరలు
- టన్నుకు రూ.10 వేలు పెరిగిన ఐరన్
- నిర్మాణదారులు విలవిల.. రంగం కుదేలు
- ధరలపై కొరవడిన ప్రభుత్వ నియంత్రణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సిమెంటు, ఇనుము ధరలు దూసుకుపోతున్నాయి. ధరల పెరుగుదలతో నిర్మాణదారులు కళ్లు తేలేస్తున్నారు. ఇసుక ధర తగ్గిందన్న సంతోషం ఇనుము.. సిమెంట్ ధరల పెరుగుదలతో ఆవిరైపోయింది. వేసవిలో సహజంగా నిర్మాణాలు ఊపందుకుంటాయి. ఇదే అదనుగా కంపెనీలు ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నాయి. కంపె నీలు సిండికేట్‌తో సిమెంట్ ధరలను అమాంతం పెంచాయి. మూడు రోజుల వ్యవధిలోనే సిమెంట్ బస్తాకు రూ.80 నుంచి రూ.90 ధర పెరిగింది. ఇనుము నెల రోజుల వ్యవధిలో టన్నుకు రూ.10 వేలు పెరిగింది. ధరల పెరుగుదలపై ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా కొరవడింది. దీంతో కంపె నీలు ధరలపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా యని నిర్మాణదారులు ఆరోపిస్తున్నారు. ధరల పెరుగుదల నిర్మాణదా రులపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. సిమెంట్ ధరను పెంచడంతో పాటు సరఫరాను కంపెనీలు తగ్గించేశాయి. వ్యాపారులకు పూర్తిస్థాయిలో సిమెంట్ సరఫరా చేయడం లేదన్న విమర్శలున్నాయి. కృత్రిమ కొరతను సృష్టించేందుకు కంపె నీలు సిద్ధమయ్యాయన్న ఆరోపణలున్నాయి. సిమెంట్ కంపెనీలు సిండికేటై ఒక్కసారిగా బస్తాకు రూ.90 ధర పెంచాయని నిర్మా ణ దారులు వాపోతున్నారు. మార్కెట్‌లో విక్రయిస్తున్న అన్ని రకాల సిమెంట్ ధరలను కంపెనీలు పెంచేశాయి. రోజురోజుకు సిమెంట్ ధరలు పెరుగుతున్నా నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని నిర్మాణ రంగ వర్గాలు విమర్శిస్తున్నాయి. సిమెంట్ కంపెనీలకు పాలకులు ఒత్తాసు పలకడం వల్లే ధరలను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత నెలలో ఇనుము టన్ను రూ.55,000 ఉంది. నెల రోజుల వ్యవధిలోనే మార్కెట్‌లో రూ.65 వేలకు చేరింది. రెండు రోజుల క్రితం ఒకేసారి టన్నుకు రూ.4 వేలు పెరిగిందని నిర్మాణ దారులు చెప్పారు. ఇనుము, సిమెంట్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో 20 శాతం భారం పడిందని నిర్మాణ దారులు వాపో తున్నారు. ధరల పెరుగుదలతో నిర్మాణాలను పలువురు నిలిపివే స్తున్నారు. దీంతో కార్మికులు ఉపాధిని కోల్పో తున్నా రు. ధరలను నియంత్రించి నిర్మాణ రంగాన్ని ప్రభు త్వం కాపాడాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

ఇసుక టన్ను రూ.500

అక్రమార్కుల మధ్య పెరిగిన పోటీతో ఇసుక ధర తగ్గింది. టన్ను ఇసుక రూ.500కు ప్రస్తుతం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. దీంతో కృష్ణానదిలో ఇసుక అక్రమ మైనింగ్ పెద్దఎత్తున జరుగుతోంది. రోజు వేలాది టన్నుల ఇసుక మార్కెట్‌లోకి అక్రమార్కులు తరలిస్తున్నారు. నాణ్యమైన ఇసుక అందుబాటు ధరలోకి రావడంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో సిమెంట్, ఇనుము ధరలు పెరగడంతో ఈ ప్రభావం నిర్మాణాలపై పడుతోంది.

పర్యాటకంగా బీచ్‌ల అభివృద్ధి

జూలైకి సూర్యలంక, రామాపురంలో బోటింగ్‌కి ఏర్పాట్లు

పర్యాటక శాఖ సమీక్షలో కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సూర్యలంక, రామాపురం బీచ్‌లను పర్యాటకంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పర్యాటకశాఖాధికారులు, కన్సల్టెంట్లతో బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బీచ్‌ల వద్ద రిసార్ట్స్ నిర్వాహణపై రూపొందించిన నివేదికలపై ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జూలైకి సూర్యలంక, రామాపురం బీచ్‌ల్లో బోటింగ్ షికారు అమల్లోకి తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. రెండు బీచ్‌లను పర్యావరణానికి ఎలాంటి హాని, కాలుష్యంలేని ప్రాంతాలుగా గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ రెండు బీచ్‌ల్లో 20 మంది శాస్త్రవేత్తలు పర్యటించి అధ్యయనం చేశారన్నారు. జిల్లాలో జీడిపప్పు ఉత్పత్తి అధికంగా ఉన్నందున విక్రయాలు, ఉత్పత్తి ప్రదర్శనలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. బోటింగ్ షికారుపై మత్స్యకారులకు కల్గరి శిక్షణ ఇవ్వాలన్నారు. చేనేత ఉత్పత్తుల పెంపు, ప్రదర్శనల కొరకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఓడరేవు వద్ద రెవెన్యూ అసోసియేషన్‌కు సంబంధించిన ఎకరా స్థలాన్ని ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామన్నారు. పేరలి డ్రెయిన్ బోటింగ్‌కు అనువైన ప్రాంతంకాగా పర్యాటకుల కొరకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, పర్యాటకశాఖ సహాయసంచాలకులు డాక్టర్ లజ్వంతినాయుడు, కన్సల్టెంట్ సాహితి దివి, జిల్లా పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

సీఎం హామీల అమలుకు చర్యలు

పర్చూరు నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో ఇచ్చిన హామీలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి, ప్రతి మండలంలో ఒక అంబేద్కర్ భవన నిర్మాణానికి, సబ్‌స్టేషన్ నిర్మాణానికి, గ్రావెల్‌రోడ్ల ఏర్పాట్లపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చినగంజాం మండలంలో కొత్త గొల్లపాలెం గ్రామ పర్యటనలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన వాటిని పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పీ-4 కింద ఎన్నికైన కుటుంబాల అవసరాలపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావుని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, ముఖ్యప్రణాళికాధికారి శ్రీనివాసరావు, విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెలపై.. నిర్లక్ష్యం

- గుంటూరు, పల్నాడు జిల్లాలు వెనకడుగు
- గుంటూరులో 2, పల్నాడులో 12 మాత్రమే నిర్మాణం
- బాపట్లలో ఇప్పటికే 74 పూర్తి.. మరో 51కి అనుమతి
- రెండు వారాల వ్యవధిలో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- ఉపాధి హామీ పథకాన్ని విరివిగా వినియోగించాలని సూచన

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి వేడి, వడగాడ్పుల దృష్ట్యా పశువులపై తీవ్ర ప్రభావం పడకుండా నీటి తొట్టెలను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ నీటి తొట్టెల నిర్మాణాలపై అధికారుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించినా అధికారుల్లో పెద్దగా స్పందన లేదని నీటి తొట్టెల నిర్మాణాలను చూస్తే అర్థమవుతోంది. గుంటూరు జిల్లాలో మొత్తం 30 తాగునీటి తొట్టెలు పశువులకు అవసరం అవుతాయని అంచనా వేశారు. అయితే వీటిలో ఇప్పటి వరకు కేవలం రెండు మాత్రమే నిర్మిం చారు. పల్నాడు జిల్లాలో వాతావరణం ఎక్కువ వేడిగా ఉంటుంది. అంతేకాకుండా అక్కడ పశువుల సంఖ్య కూ డా అధికం. ఈ దృష్ట్యా ఈ జిల్లాలో 248 నీటి తొట్టెలను వేర్వేరు గ్రామాల్లో నిర్మించాలని ఆదేశించగా వాటిల్లో కేవలం 12 మాత్రమే ఇప్పటివరకు ఆ జిల్లా అధికారులు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో 236 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బాపట్ల జిల్లాలో అధికారులు కొంత శ్రద్ధ పెట్టడంతో అక్కడ ఇప్పటికే 74 తొట్టెల నిర్మాణం పూర్తి చేశారు. మరో 51 తొట్టెల నిర్మాణాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. వీటిని కూడా ఉపాధి హామీ పథకం ద్వారా తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి తొట్టెలను నింపే బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్‌కి కేటాయించారు. ఎండ వేడి నుంచి పశువులు, గొర్రెలు, మేకలను సంరక్షించుకోవడానికి శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచేందుకు ఈ తొట్టెల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ప్రతీ పశువుకు రోజుకు సుమారు 30 నుంచి 40 లీటర్ల తాగునీరు అవసరం అవుతుంది. ఆవులకు 30 లీటర్లు, గేదెలకు 40 లీటర్లు, గొర్రెలు, మేకలకు 5 లీటర్లు నీరు అవసరం. ఇందుకోసం 5,200 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి తొట్టెలను గ్రామాల్లో నిర్మించాలని ప్రభుత్వం సూచించింది.



పశువుల నీటి తొట్టె

ఆస్తులతో పాటు ఉపాధి..

రబీ సీజన్‌లో పంటల సాగు దాదాపుగా పూర్తి అయింది. వరి, ఇతర పంటల కోతలు ముగిశాయి. ఈ నేపథ్యంలో కూలీలు పనులు లేక ఇబ్బంది పడుతుంటారు. కొందరైతే ఇతర ప్రాంతాలకు వలస కూడా వెళుతుంటారు. ఈ నేపథ్యంలో నీటి తొట్టెల నిర్మాణ పనులను ఉపాధి హామీ కింద చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దీనివల్ల అటు స్థిరాస్తులు ఏర్పడటమే కాకుండా ఇటు వ్యవసాయ కూలీలకు ఉపాధి పనిదినాలు అందుబాటులోకి వస్తాయి. ఇటీవలే రోజుకు ఉపాధి కూలిని రూ.300లకు పైగా ప్రభుత్వం పెంచింది. 100 రోజులకు పైగా పనిదినాలు కూడా కల్పించే అవకాశాన్ని కల్పించింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణంపై అధికారులు దృష్టి పెడితే అటు మూగజీవాలకు ఇటు వ్యవసాయ కూలీలకు మేలు జరుగుతుంది.

రూ.కోటి భూమి అన్యాక్రాంతం

మార్టూరు చెరువులో ప్లాట్లు.. అమ్మకాలు

మార్టూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రూ.కోటికి పైగా విలువైన మార్టూరు చెరువు పోరంబోకు స్థలం అన్యాక్రాంతమైంది. ఆక్రమిత స్థలంలో ఇప్పటికే ఎర్రమట్టిని పోసి చదును చేసి ప్లాట్లుగా మార్చి హద్దురాళ్లు కూడా వేశారు. అనధికారికంగా సెంట్ రూ.2 లక్షల చొప్పున కొందరికి అమ్మినట్లు తెలిసింది. మార్టూరు నుంచి రాజుగారిపాలెం వెళ్లే రోడ్డులో ఆర్‌జేఎస్‌టీ కాలనీకి సమీపంలో రోడ్డు పక్కన 342-బీ, 343 సర్వే నంబర్లలో చెరువు బోరంబోకు స్థలం ఎకరం 69 సెంట్లు ఉంది. గతంలో దానిపై మార్టూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అగ్రగణ్యులైన కొంతమంది కన్నేశారు. కాని అప్పటి రెవెన్యూ అధికారులు అడ్డుతగలడంతో విరమించుకున్నారు. చెరువు స్థలాన్ని ఎలాగైనా కాజేయాలని ఎదురుచూస్తున్న అక్రమార్కులు ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భావించారు. కొంతమందిని బినామీలుగా పెట్టుకుని తెరవెనుక ప్లాట్ల అమ్మకాలను మొదలు పెట్టారు. అయినా ఇప్పటి వరకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు కన్నెత్తి కూడా చూడలేదన్న విమర్శలున్నాయి. మార్టూరు సెంటరుకు కూతవేటు దూరంలో మంచినీటి చెరువుకు, పోలీస్‌స్టేషన్‌కు, ప్రభుత్వ జూనియర్ కాలేజీకి సమీపంలోని చెరువు స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారు. చెరువు స్థలంలో ప్లాట్లకు పంచాయతీ, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి ఇవ్వలేదని ఈవో తన్నీరు శ్రీనివాసరావు తెలిపారు.

రాజుగారిపాలెం రోడ్‌లో చెరువు పోరంబోకు స్థలంలో అమ్మకాలు కోసం వేసిన ఇంటి నివేశన స్థలాల ప్లాట్లు



క్లీనర్‌ను కాపాడిన గోల్డెన్ అవర్ ఇంజెక్షన్



వినుకొండ ఏరియా వైద్యశాల్లో లారీ క్లీనర్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుండె పోటు వచ్చిన లారీ క్లీనర్‌ను సకాలంలో ఏఎన్ఎం, సీహెచ్‌వోలు స్పందించి ప్రాణాలు నిలిపిన ఉదంతం కంచర్ల ప్రాథమిక వైద్యశాలలో జరిగింది. కంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం నాగవాణి వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచర్ల గ్రామంలోని ఓ రైస్ మిల్లుకు విజయవాడ నుంచి ధాన్యం లోడుతో ఓ లారీ వచ్చింది. లారీలోని క్లీనర్‌కు ఒళ్లు అంతా చెమటలు పట్టి అస్వస్థతకు గురవటంతో కంచర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. క్లీనర్ పరిస్థితి గమనించి నాగవాణి, ప్రమీలలు గుండెపోటుగా గుర్తించి తమ కారులో క్లీనర్‌ను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేర్చారు. ప్రమాదాన్ని గుర్తించిన వినుకొండ వైద్యాధికారి డాక్టర్ రజాక్ సిబ్బంది సాయంతో క్లీనర్‌కు ఈసీజీ, బీపీ, రక్త పరీక్షలు చేసి గుండెపోటు వచ్చినట్లు నిర్ధారించారు. ఇటీవల ప్రభుత్వ వైద్యశాలల్లో రూ.40 వేలు విలువ చేసే గుండెపోటు నివారణ ఇంజెక్షను తక్షణమే ఇచ్చి ప్రాణాలను కాపాడారు. అనంతరం విజయవాడలోని క్లీనర్ బంధువులకు సమాచారం అందించారు. మెరుగైన వైద్యంకోసం 108 అంబులెన్స్‌లో గుంటూరుకు తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు, మిల్లు ఓనర్ శ్రీనివాసరావులు సత్వరమే స్పందించి క్లీనర్ ప్రాణాలను కాపాడిన ఏఎన్ఎం, సీహెచ్‌వో, వైద్య బృందానికి అభినందనలు తెలిపారు. వినుకొండ వైద్యశాల పరిధిలో ఇప్పటివరకు 15మందిని ఈ గోల్డెన్ అవర్ ఇంజెక్షన్ అందించి ప్రాణాలను కాపాడినట్లు వైద్యాధికారి డాక్టర్ రజాక్ తెలిపారు.

ఐఆర్ఆర్‌కు భూ సమీకరణ

2,196 ఎకరాల సమీకరణకు సీఆర్‌డీఏ సన్నాహాలు

వీలుపడని చోట భూసేకరణ ప్రయత్నాలు

సమీకరణ అయితేనే రైతులకు, సీఆర్‌డీకు ప్రయోజనం

భూములను సిద్ధం చేసుకున్నాకే రింగురోడ్డు నిర్మాణం

ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూ సమీకరణ విధానాన్ని అవలంబించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. దీనిపై త్వరలో కీలక నిర్ణయం తీసుకుని ముందుకెళ్లాలని యోచిస్తున్నారు. రాజధాని ప్రాంత పరిధిలోని అన్ని జిల్లాలకూ భూ సమీకరణ విధానాన్నే అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ విధానమైతే బహుళ ప్రయోజనకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో సీఆర్‌డీఏ ఈ ఆలోచన చేసింది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో 2,196 ఎకరాలు కావాల్సి ఉంటుంది. ఈ భూములను భూ సమీకరణ విధానంలో తీసుకుంటేనే సీఆర్‌డీఏకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే 75 మీటర్ల వెడల్పున నిర్మించే ఇన్నర్ రింగ్‌రోడ్డుకు భూ సేకరణ విధానంలో అయితే సగటున రూ.3,000 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే భూ సమీకరణ విధానంలో అయితే అంత భారం ఉండదు. సమీకరణ విధానంలో అయితే రైతులకు ప్రతిగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను కల్పించాల్సి ఉంటుంది. ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరం. ఎందుకంటే రూ.61 వేల కోట్లతో రాజధాని పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మూడేళ్లలో అమరావతి ఒక రూపును సంతరించుకోనుంది.

రాజధానిలో వచ్చే బూమ్ కారణంగా రైతులకు భూ సమీకరణ కింద ఇచ్చే ప్యాకేజీకి భారీగా విలువ పెరుగుతుంది. ప్రస్తుత మార్కెట్ ధరలను చూసినా కూడా రైతులు ఇచ్చే భూముల ధరలకు సమానంగా ప్యాకేజీ వచ్చే పరిస్థితి ఉంటుంది. ఈ దిశగా రైతులను చైతన్యపరచటానికి త్వరలో గ్రామసభలు నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు.

భూములను సిద్ధం చేసుకున్నాకే ఐఆర్ఆర్

ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్)కు అవసరమైన 2,196 ఎకరాలను సిద్ధం చేసుకున్నాకే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. భూములను సిద్ధం చేసుకోవటానికి ఏడాది సమయాన్ని నిర్దేశించుకుంది. ఆ తర్వాతే రోడ్డు నిర్మాణ పనుల దిశగా అడుగులు వేయాలని భావిస్తోంది. భూ సమీకరణకు ఎవరైనా అంగీకరించకపోతే భూ సేకరణ విధానంలో అయినా వెళ్లాల్సి ఉంటుంది.

పాత నోటిఫికేషన్ ప్రకారమే..

పాత నోటిఫికేషన్ ప్రకారమే ఐఆర్ఆర్‌ను కొనసాగించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పులు చేపట్టకూడదని నిర్ణయించినట్టు తెలిసింది. పాత అలైన్‌మెంట్ ప్రకారం 96.16 కిలోమీటర్ల పొడవున, 75 మీటర్ల వెడల్పున ఐఆర్ఆర్ ఉంటుంది. ఐఆర్ఆర్‌కు క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న 27 రోడ్లు కూడా పాత అలైన్‌మెంట్ ప్రకారమే అనుసంధానమవుతాయి. సీఆర్‌డీఏ పరిధిలోని 11 జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ల పరిధిలో ఐఆర్ఆర్ వస్తుంది. మొత్తం 42 గ్రామాల మీదుగా సాగుతుంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సంబంధించి చోడవరం, దాములూరు, దొనె ఆత్కూరు, గంగూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కవులూరు, కేతనకొండ, కొండపల్లి, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్, కొటికలపూడి, కొత్తూరు, నవీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం, వెలగలేరు, రామచంద్రాపురం, వెదురుపావులూరు, సావారిగూడెం, నున్న, పాతపాడు, నిడమానూరు, పెనమలూరు, పోరంకి తదితర గ్రామాల మీదుగా అలైన్‌మెంట్ సాగుతుంది.

ఐఆర్ఆర్‌కు అనుసంధానమయ్యే అమరావతి రోడ్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డుకు రాజధానిలోని మొత్తం 27 రోడ్లు అనుసంధానమవుతాయి. ఈ-1, 2, 3, 4, 5, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, ఎన్-4, 7, 8, 9, 10, 11, 12, 13 రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే వంటివి అనుసంధానమవుతాయి. ఇవన్నీ కూడా సింహభాగం 50 మీటర్లు, మిగిలినవి 60 మీటర్ల మేర ఉన్నాయి. మొత్తం 1,362.30 ఎకరాల మేర భూములు ఐఆర్ఆర్‌కు అనుసంధానమవుతాయి.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు



నిందితుల వివరాలను తెలుపుతున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాష్‌రావు తదితరులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం సంపాదించాలన్న అత్యాశతో నిషేధిత గంజాయిని విక్రయాలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడిన ఉదంతం తెనాలిలో చోటుచేసుకుంది. బుధవారం స్థానిక త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు కేసు వివరాలను వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ గుంటూరుకు చెందిన నందిపాటి రాజశేఖరరెడ్డి, మేడికొండూరుకు చెందిన తమనంపల్లి అరుణ్‌కుమార్, తెనాలి చినరావూరుకు చెందిన దాసరి ప్రకాష్‌బాబులు ముగురు కలసి ముఠాగా ఏర్పడ్డారు. రాజశేఖరరెడ్డి హైదారాబాదు నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి దగ్గర 1.5 కేజీల గంజాయిని రూ.45 వేలుకు కొనుగోలు చేసి తెనాలి ప్రాంతానికి తెచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా కళాశాలలు, ఇతర ప్రాంతాలలో యువకులకు విక్రయిస్తున్నారు. ఇదే క్రమంలో నిషేధిత గంజాయి అమ్ముతున్నట్లు త్రీటౌన్ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా నిషేధిత గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డారు. వారి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకొని నిందుతులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. నిషేధిత గంజాయి ఇతర మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లుగాని, అమ్మకాలు చేస్తున్నట్లుగాని ప్రజల వద్ద సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ వెల్లడించారు. గంజాయి విక్రేతలను చాకచక్యంగా పట్టుకున్న సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాషరావు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ జనార్ధనరావు అభినందించారు. కార్యక్రమంలో సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాషరావు, పీసీఎస్ పి మురళి, కె బాబురావు, ఎస్ జైకర్, ఎన్ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన కోసం పదేపదే తప్పులు

గుంటూరు రైల్వే ఆపరేటింగ్ విభాగంపై విమర్శలు ● తరచూ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు ● కొత్త డీఆర్ఎం అయినా పట్టించుకునేనా!

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైళ్ల సమయపాలన కోసం గుంటూరు రైల్వే డివిజన్ ఆపరేటింగ్ విభాగం అడ్డదారులు తొక్కుతున్నది. రైలు గుంటూరు రైల్వేస్టేషన్‌లో హోం సిగ్నల్ పాస్ అయిన తర్వాత సమయాన్ని ఆర్‌టీఎస్ ద్వారా ఆటోమేటిక్‌గా నమోదు చేయకుండా మాన్యువల్‌గా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రైళ్లు రెడ్డిగూడెం వద్ద ఉంటే బండారుపల్లి దాటి నల్లపాడు వచ్చేస్తున్నట్లు ఎంట్రీ కొడుతున్నారు. ఇక్కడ టెర్మినేట్ అయ్యే రైళ్లకు 15 నిమిషాల బఫర్ సమయం ఉండటంతో దాని ప్రకారం అంచనా వేస్తూ ఒకవేళ ఆలోపు రైలు వచ్చే పరిస్థితి లేకుంటే గూడ్స్ రైళ్లు ఆ సందర్భంలో పాస్ అయినా రైలు కింద నమోదు చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతున్నది.

ఏదైనా రైలు ఆలస్యమౌతుంటే ఆపరేటింగ్ విభాగంలో డిప్యూటీ అధికారి జోక్యం చేసుకొని ఆ ట్రైన్‌కు ప్రిసిడెన్స్ ఇచ్చి తీసుకొచ్చేలా చూడాలి. అలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోసం 20 నిమిషాల నుంచి అరగంట పాటు నాన్‌స్టాపేజ్ రైల్వేస్టేషన్లలోని లూప్‌లైన్‌లో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేసేస్తున్నారు.

ఎన్‌టీఈఎస్(నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టమ్)పై రైలు ప్రయాణీకులు నమ్మకం కోల్పోయేలా కొంతమంది ఆపరేటింగ్ విభాగం సిబ్బంది చేస్తున్నారు. బుధవారం ట్రైన్ నంబరు. 12748 వికారబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని వందేభారత్ రైలు కోసం రెడ్డిగూడెం రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేశారు. దాదాపుగా ఈ రైలుని 25 నిమిషాల పాటు అక్కడ క్రాసింగ్ కోసం ఆపారు. అయితే ఆపరేటింగ్ విభాగం సిబ్బంది మాత్రం రైలు రాత్రి 8.09కే బండారుపల్లి దాటిందని, 8.19కి నల్లపాడు దాటిందని తప్పుడు సమాచారాన్ని ఎన్‌టీఈఎస్‌లో అప్‌డేట్ చేశారు. అది చూసి ప్రయాణీకులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. గతంలో నంబరు. 17254 ఔరంగబాద్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ని నల్లపాడులో గంటకు పైగా ఆపి గూడ్స్ రైళ్లకు ప్రిసిడెన్స్ ఇచ్చినట్లు ఒక ప్రయాణీకుడు ఫిర్యాదు చేశారు.

ఈ తరహా సంఘటనలు గుంటూరు రైల్వే డివిజన్‌లో నిత్యకృత్యంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఆపరేటింగ్/స్టేషన్ సిబ్బంది మాన్యువల్‌గా రైళ్ల ఆగమన సమయాన్ని నమోదు చేయకుండా ఆర్‌టీఎస్ పంపే సమాచారాన్ని యథాతథంగా ఎన్‌టీఈఎస్‌లో అప్‌లోడింగ్ చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. దీని వలన తమకు రైలు ప్రయాణిస్తున్న కచ్చితమైన సమయం తెలుసుకొనే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలానే రైలు ఏదైనా స్టేషన్‌కు వచ్చి ఆగి బయలుదేరినప్పుడు ఫస్టు సిగ్నల్ పాసింగ్ సమయం నమోదు అయ్యేలా చూడాలని సూచిస్తున్నారు. లేకుంటే ఇలాంటి సమాచారాలతో ఎన్‌టీఈఎస్ విశ్వసనీయత దెబ్బతింటుంది. నూతన డీఆర్ఎం సుదేష్ణ సేన్ ఆపరేటింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రయాణీకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపల్లె ఎక్స్‌ప్రెస్ చర్లపల్లి వరకే

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం రేపల్లె - సికింద్రాబాద్ - రేపల్లె మధ్యన రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌ని కొన్ని నెలల పాటు చర్లపల్లి వరకే నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి నంబరు. 17645 చర్లపల్లి - రేపల్లె ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి రాత్రి 9.05కి రేపల్లె చేరుకొంటుంది. నంబరు. 17646 రేపల్లె - చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.10కి బయలుదేరి మధ్యాహ్నం 3.35కి చర్లపల్లి చేరుతుంది. మార్గమధ్యలో ఉన్న రైల్వేస్టేషన్లలో ఎలాంటి సయమపట్టికలో ఎలాంటి మార్పులు చేయలేదని సీపీఆర్‌వో తెలిపారు.

హైదరాబాద్ డివిజన్‌లో ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 11, 12, 13 తేదీల్లో గుంటూరు - ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌ని 90 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేస్తున్నట్లు డీఆర్ఎం సుదేష్ణ సేన్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

బొమ్మాయిపల్లి వరకు ఇన్‌స్పెక్షన్ నిర్వహించిన డీఆర్ఎం

గుంటూరు రైల్వే నూతన డీఆర్ఎం సుదేష్ణ సేన్ తన క్షేత్ర పర్యటనలను ప్రారంభించారు. బుధవారం ఉదయం ఆమె గుంటూరు నుంచి ప్రత్యేక రైలులో నడికుడి మార్గంలో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. బొమ్మాయిపల్లి వరకు వెళ్లారు. మార్గమధ్యలోని స్టేషన్లలో దిగి అక్కడి పరిస్థితులను తెలుసుకొన్నారు. అలానే కృష్ణానదిపై వంతెన, గుంటూరు, నల్గొండ జిల్లాల్లో ఉన్న సరుకు రవాణ టెర్మినల్స్‌ని పరిశీలించారు.

కారుమూరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి

గుంటూరులో పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు



గుంటూరులో వెస్ట్ డీఎస్పీ అరవింద్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు కనపర్తి, మ్యానీ తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఇవతల వాళ్లను ఇంటిలో నుంచి లాగి కొడతామని.... గుంటూరు అవతల వాళ్లను నరికేస్తామని అత్యంత దారుణంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గుంటూరు వెస్ట్ డీఎస్పీ అరవింద్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, యల్లావుల అశోక్ యాదవ్, మైనార్టీ నాయకుడు పఠాన్ అస్మతుల్లా, అడకా శ్రీనివాసరావు, రఘు వెస్ట్ డీఎస్పీ అరవింద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కనపర్తి మాట్లాడుతూ మంగళవారం ఏలూరులో జరిగిన వైసీఈపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమాజంలో ప్రజల మధ్య, రాజకీయ పక్షాల మధ్య వైషమ్యాలు పెంచే విధంగా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలనే కుట్రతో నరికేస్తాం, ఇళ్లలో నుంచి లాగి కొడతాం అంటూ అత్యంత దారుణమైన వ్యాఖ్యలు చేశారన్నారు. ఆయన పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని పశ్చిమ డీఎస్పీ అరవింద్ కి ఫిర్యాదు చేశారు. కారుమూరి ఉడతూపులకు భయపడే ప్రసక్తే లేదని, జగన్‌రెడ్డి లాంటి సైకోలానే ఎదిరించి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని అన్నారు. బాధ్యత కలిగిన మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రులే ఇంత దారుణంగా విచక్షణ మరచి వ్యాఖ్యలు చేస్తుంటే ఆ పార్టీ నాయకులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందన్నారు.

కన్నతల్లిని కడతేర్చిన కొడుకు

పోలీసుల అదుపులో నిందితుడు



బసవపూర్ణమ్మ (ఫైల్ ఫొటో)

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కన్న తల్లినే కొడుకు కడతేర్చిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. భట్టిప్రోలుకు చెందిన అంగలకుదురు బసవపూర్ణమ్మ (74)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు దుర్గారావు నిజాంప ట్నం మండలం అడవులదీవిలో తాపీ పని చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితం భార్యతో గొడవపడి అక్కడి నుంచి భట్టిప్రోలు వచ్చి తల్లి వద్దే ఉంటున్నాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లితో తరచూ గొడవ పడుతుంటాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లిని కోరడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి ఇంట్లో ఉన్న కత్తిపీటతో చెవి, తల వెనుక భాగంలో నరకడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెం దింది. తల్లి, కొడుకు గొడవ పడుతున్న విషయాన్ని చుట్టుపక్కల వారు గమనించినప్పటికీ రోజు పడే గొడవలే అను కొని పెద్దగా పట్టించుకోలేదు. కొద్దిసేపటి తరువాత అను మానం వచ్చి చూడగా వృద్ధురాలు మంచంపై విగతజీవిగా పడి ఉండటం గుర్తించిన వారు స్థానికంగా ఉంటున్న మరో కుమారుడు వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇంటికి వచ్చి తల్లిని చూడగా మృతి చెంది ఉండటం గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బుధవారం ఉదయం రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు ఘటనా స్థలాన్ని సందర్శించి హత్య జరిగిన తీరును పరిశీలించి క్లూస్ టీమ్‌తో వేలిముద్రలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం వైద్యశాలకు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అహంకార పూరితంగా వ్యవహరిస్తున్న జగన్ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెలో జగన్ చేసిన వీరంగం యాక్షన్ సినిమా క్లైమాక్స్ ను తలదన్నిందన్నినట్లుగా ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం పేర్కొన్నారు. పేరుకే పరామర్శ తప్ప జగన్ ప్రదర్శించినవన్నీ ఫ్యాక్షనిస్ట్ పోకడలేనని అన్నారు. పోలీస్ వ్యవస్థపై జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఆధిపత్య ధోరణికి, అహంకారానికి నిదర్శనాలని అన్నారు. పోలీసుల బట్టలు ఊడదీయిస్తానన్న జగన్ వ్యాఖ్యలు ఏపీ పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చ అని,తన తప్పు తెలుసుకొని జగన్ బేషరతు క్షమాపణ చెప్పేవరకు పోలీస్ వ్యవస్థ పోరాడాలని సూచించారు. పోలీస్ అధికారుల సంఘం న్యాయస్థానాల్ని ఆశ్రయించి జగన్ కు శిక్షపడేలా చూడాలని పేర్కొన్నారు.

నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అర్బన్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం ఇటికంపాడు రోడ్డులో అక్రమంగా రేషన్ బియ్యం కలిగి ఉన్న మురళి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

12 ఎకరాల మొక్కజొన్న.. అగ్గిపాలు

ముప్పాళ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో, అది పక్కన ఉన్న పంటకు అంటుకోవడంతో ముప్పాళ్ళ మండలం కుందురువారిపాలెంలో 12 ఎకరాల్లోని మొక్కజొన్న దగ్ధమైంది. నష్టపోయిన వారిలో కౌలురైతులు కూడా ఉన్నారు. కాగా అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా కావాలని పెట్టారా అనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. తగలబడిన పంట పొలాలను తహశీల్దార్ భవానిశంకర్ ఆదేశాల మేరకు వీఆర్వో బోరుపోతు మరియదాసు పరిశీలించారు.

మిర్చి రైతులకు వ్యాపారి టోకరా..

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు, అబ్బూరు, ఫిరంగిపురం మండలం 113 తాళ్ళూరు, యర్రగుంట్లపాడు గ్రామాలకు చెందిన రైతుల నుంచి లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన రావిపూడి తిరుమల రావు గతనెల 16న మిర్చి కొనుగోలు చేశాడు. గత కొన్ని సంవత్సరాలుగా తిరుమలరావు రైతుల వద్ద నుంచి కమ్మకంగా మిర్చిని కొనుగోలు చేస్తూ నగదు చెల్లిస్తున్నాడు. అదే నమ్మకంగా ఆయా గ్రామాలకు చెందిన సందు సురేష్, యస్‌కే సుభాని, మక్కెన సత్యన్నారాయణ, కొల్లికొండ కోటేశ్వరరావు, కొండవీటి ఏసుబాబు, కొండవీటి సీతారామయ్య, జొన్నలగడ్డ సుబ్బారావు, కొండవీటి నాగేశ్వరరావు, నర్రా కోటేశ్వరరావు, నర్రా మల్లేశ్వరరావు, నర్రా శ్రీను, కర్నాటి శేషగిరిరావు, సత్తెనపల్లి పోలిరాజు ల వద్దనుండి 41 లక్ష 3000 రూపాయల విలువైన 381.5 క్వింటాళ్ళ మిర్చిని కొనుగోలు చేశాడు. వీరిలో కొందరికి అడ్వాన్స్ కింద 6 లక్షల రూపాయలకు పైగా చెల్లించాడు. ఇంకా రైతులకు 34 లక్షల 85వేల 500రూపాయలను చెల్లించాల్సి ఉంది. ఈ నగదును యార్డులో మిర్చి అమ్మి చెల్లిస్తానని రైతులకు తిరుమలరావు చెప్పాడు. రోజులు గడుస్తున్నా తిరుమలరావు డబ్బును చెల్లించక పోవడం, అదేమని ప్రశ్నిస్తే ఊరు వదిలిపోతానా అని దురుసుగా సమాధానం చెప్పేవాడని రైతులు తెలిపారు. అనుమానం వచ్చి గట్టిగా నిలదీయడంతో తరవాత నుండి కనిపించడం లేదని ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని రైతులు రూరల్ పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారు. రైతు మక్కెన సురేష్‌బాబు ఇచ్చిన పిర్యాదు మురకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు తెలిపారు.

ఎంఈవో వసూళ్ల దందాపై విచారణ

ఆంధ్రజ్యోతి వార్తకు డీఈవో రేణుక స్పందన

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పగించిన విధులు విస్మరించి ప్రైవేటు పాఠశాలల్లో , ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ విషయంలో వసూళ్ల దందాకు పాల్పడుతున్న ఇద్దరు ఎంఈఓ లపై డీఈవో రేణుక విచారణకు ఆదేశించారు. గుంటూరు డిప్యూటీ డీఈవో ఏసురత్నం ఆధ్వర్యంలో విచారణ చేపట నున్నారు. ప్రైవేటు పాఠశాలల యాజ మాన్యా లను, ఎయిడెడ్, ప్రభుత్వ ఉపాధ్యాయులను పూర్తిస్థాయిగా విచారించి ఎవరెవరు ఎంతెంత డబ్బులు ఇచ్చారనే దానిపై సమగ్ర నివేదిక తయారుచేసి డీఈవోకు సమర్పించనున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,35,382 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,31,198 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,35,382 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 62,733 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13200
273	10000	12800
341	10500	13800
4884	10000	11600
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10200	13400

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12400
బ్యాడిగి 355	10000	13200
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10000	12500
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6500

నేడు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

చుండూరు, కొల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ విస్తృత స్థాయి సమావేశం రెండు మండలాల్లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కార్యాలయ సిబ్బంది బుధవారం తెలిపారు. గురువారం ఉదయం భట్టిప్రోలులోని ఆర్యవైశ్య కల్యాణ మండపం నందు ఉదయం 10 గంటలకు జరిగే విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ఆనందబాబు పాల్గొంటారన్నారు. సాయంత్రం 6 గంటలకు చుండూరులోని బాబు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని, రెండు మండలాల్లో జరిగే సమావేశాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశానికి బూత్‌ల వారీగా కేఎస్ఎస్ జాబితాలను తీసుకురావాలని ఇన్‌చార్జ్‌లకు సూచించారు.

నేటి నుంచి కుట్టు శిక్షణ

చెరుకుపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరుకుపల్లి-2 సచివాలయం నందు గురువారం కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీవో షేక్ మహబూబ్‌సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామపంచాయతీల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. మొత్తం 344 మంది శిక్షణ కోసం నమోదు చేసుకోగా మొదటి బ్యాచ్‌కి - 117మంది, రెండో బ్యాచ్‌కి - 114మంది, మూడో బ్యాచ్‌కి 113మందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. మొదటిబ్యాచ్‌లో కుంచాలవారిపాలెం, రాంబొట్లపాలెం, కావూరు, ఆరుంబాక, చెరుకుపల్లి, గుళ్ళపల్లి, బలుసులపాలెం, తుమ్మలపాలెం; రెండో బ్యాచ్‌లో గూడవల్లి, నడింపల్లి, కనగాల, ఆరేపల్లి, ఆళ్ళవారిపాలెం, తూర్పుపాలెం, పొన్నపల్లి, రాజోలు గ్రామాల వారు హాజరవుతారని చెప్పారు. 3నెలలు జరిగే ఈట్రైనింగ్‌లో 90శాతం హాజరు కలిగి ఉండి పరీక్ష ఉత్తీర్ణత సాధించినవారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

దివ్యాంగులకు ఉపకరణాలు

● ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

కర్లపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు సహకార సంస్థ ముందుకు వచ్చిందని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, చేతికర్రలు తదితర ఉపకరణాలు అవిన్కో సంస్థ ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామపంచాయతీల్లో అధికారులు ఇంటింటి సర్వే చేస్తున్నారని అర్హులైన వారు ఉపకరణాలు పొందేందుకు పేరు నమోదు చేసుకోవాలన్నారు.

జిల్లా హాస్పటల్స్ కోఆర్డినేటర్‌గా మోజెస్‌కుమార్

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా హాస్పటల్స్ కోఆర్డినేటర్‌గా (డీసీహెచ్ఎస్)డాక్టర్ ఎన్ మోజెస్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ ఎవి శేషుకుమార్ పదోన్నతిపై కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్ళారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన రోగులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

రైలు కిందపడి మహిళ మృతి



రైలు పట్టాలపై ఉన్న మహిళా మృతదేహం

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రైలుపేటకు చెందిన సాలి నాగలక్ష్మి (40) బుధవారం ఉదయం రైలు కిందపడి మృతి చెందింది. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జీఆర్‌పీ పోలీసులు మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : భర్త వేధింపులపై భార్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ ఎస్ఐ చంద్రావతి తెలిపిన వివరాలు ప్రకారం రాజీవ్‌గాంధీకాలనీకి చెందిన ముద్దా ప్రిస్కిల్లాను భర్త వంశీ కొంతకాలంగా మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

బాపట్లరూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి అదృశ్యంపై వెదుళ్ళపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వెదుళ్ళపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం స్టువర్టుపురంనకు చెందిన చదలవాడ క్రాంతికిరణ్‌కుమార్ ఈనెల ఒకటో తేది నుంచి కనిపించటంలేదని భార్య కృష్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

శక్తియాప్ ఆవశ్యకతపై అవగాహన

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : శక్తియాప్ ఆవశ్యకత గురించి మహిళలకు, విద్యార్థినులకు విస్తృత అవగాహన కల్పిస్తూ జిల్లా శక్తి బృందాలు బుధవారం బాపట్ల పట్టణంలో పర్యటించారు. మహిళలకు అండగా శక్తియాప్ పనిచేస్తుందని చెప్పారు. మొబైల్ శక్తియాప్ ఉంటే రక్షణగా పోలీసు మీ వెంటే ఉన్నట్లు భద్రతతో కూడిన ప్రయాణాన్ని భరోసాగా సేఫ్ షై ట్రావెల్ సదుపాయమని తెలిపారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు 2వవార్డులోని సుశీల నర్సింగ్ కళాశాల విద్యార్థులకు పట్టణ ఎస్ఐ చంద్రావతి సిబ్బందితో కలిసి అవగాహన కల్పించి యాప్ డౌన్‌లోడ్ చేయించారు.



శక్తియాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించి చూపిస్తున్న పోలీసులు, విద్యార్థినులు

రాష్ట్రంలో ప్రజల వద్దకే పాలన

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ● ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల వద్దకే పాలన సాగించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ పాలన ద్వారా అనేక విధానాలను ప్రవేశపెడుతున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. బుధవారం వేమూరులోని పార్టీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. హాజరైన ఆనందబాబు మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసమే నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ప్రజా వేదికలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి బుధవారం ఐదు మండలాల పరిధిలోని మండలకేంద్రాల్లో ఈ వేదికలను ఏర్పాటు చేస్తామన్నారు. అర్జీలు తీసుకోవడమే కాకుండా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారులు అలసత్వం వీడాలి

ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో అధికారులు అలసత్వం వీడి సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఫిర్యాదుల పరిష్కార వేదికకు 60 అర్జీలు రాగా వాటిని ఆయన పరిశీలించారు. అర్జీదారులతో వివరంగా సమస్యపై చర్చించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారించాలని ఆదేశించారు. మండల, గ్రామ స్థాయి నుంచి హాజరుకాని అధికారులపై ఆగ్రహించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని వాటిని ఏ దశలో వాటిని పరిష్కరించాలో ఆలోచించి ఉన్నత స్థాయి అధికారుల ద్వారా ప్రజలకు సహకరించాలన్నారు. ఇకపై నిర్వహించే పరిష్కార వేదికలకు ఉద్యోగులు తప్పనిసరిగా హాజరు కావాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, రాష్ట్ర మైనార్టీ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, తహసీల్దార్ సుశీల, ఎస్ఐ రవికృష్ణ, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్‌డీ శేఖర్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబ సాధికార సారథుల నియామకం పూర్తి చేయాలి

కుటుంబ సాధికార సారథుల నియామక ప్రక్రియను గురువారం సాయంత్రం లోగా పూర్తి చేయాలని పార్టీ శ్రేణులను ఎమ్మెల్యే ఆనందబాబు ఆదేశించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల స్థాయి పార్టీ శ్రేణులతో ఆయన మాట్లాడుతూ ప్రతి 60 మందికి తప్పనిసరిగా ఒక మహిళ, ఒక పురుషుడి నియామకం జరగాలన్నారు. ఈ విషయంలో ఏ ఒక్కరు కూడా అలసత్వం చూపవద్దని కోరారు. సమావేశంలో మండలపరిధిలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారుడి కుటుంబానికి బుధవారం పంపిణీ చేశారు. మండలపరిధిలోని తాతావారిపాలెం గ్రామానికి చెందిన యారగళ్ల ముత్తమ్మ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. చికిత్సకు అయిన ఖర్చులను ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరడంతో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి అందిన రూ.1,52,609ల చెక్కును ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ముఖ్యమంత్రికి ఎమ్మెల్యేకి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విలువైన పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి

● ఐసీడీఎస్ సేవలు అభినందనీయం

● కలెక్టర్ జె.వెంకటమురళి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విలువైన పోషకాలు ఉన్న ఆహారం ప్రతి ఒక్కరు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పట్టణంలోని సాయిరాం గ్రాండ్ కన్వెన్షన్ హాలులో బుధవారం జిల్లా స్థాయి పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ డి.రాధామాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ జె.వెంకటమురళి తదితరశాఖల జిల్లా అధికారులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభసభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది పోషణ మాసోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహిస్తూ మహిళలు ఎటువంటి ఆహారం తీసుకోవాలి, ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలి, రుగ్మతల నుంచి ఏవిధంగా రక్షణ పొందవచ్చు, ఆరోగ్యకరమైన శిశువు జన్మించటానికి ఏమిచేయాలనే దానిపై అవగాహన కల్పిస్తూ ఐసీడీఎస్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనాథబిడ్డలను చేరదీసి సంరక్షించేందుకు ఇక్కడ బాలసదన్, సఖీ వన్‌స్టాప్ సెంటర్, అనాథపిల్లల సంరక్షణ కేంద్రం వంటివి ఉన్నాయని చెప్పారు. ఇక్కడ పిల్లలను దత్తతు ఇవ్వటానికి కూడా అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాలకు వచ్చే పిల్లలను సొంత బిడ్డలుగా చూసుకుంటూ ప్రేమను పంచాలని చెప్పారు. గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందిస్తూ కాన్పులు ఆస్పత్రిలో జరిగేవిధంగా చూడాలన్నారు. స్త్రీశిశు సంక్షేమశాఖ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వంటకాల స్టాల్‌ను ప్రారంభించి వాటిని పరిశీలించారు. 20మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. వారిలో ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున వేగేశన ఫౌండేషన్ ద్వారా అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. చిన్నారుల బారసాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, డీఈవో ఎస్.పురుషోత్తం, ఎస్ఈ అనంతరాజు, సీడీపీవో లక్ష్మీ పార్వతి, బాలసుబ్రహ్మణ్యం, చారులత పాల్గొన్నారు.

లంకెవానిదిబ్బకు ఆర్టీసీ నూతన సర్వీస్ ప్రారంభం

రేపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో లంకెవానిదిబ్బకు రేపల్లె డిపో నుంచి నూతన సర్వీస్‌లను ప్రారంభిస్తున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖవాసి సునిల్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి లంకెవానిదిబ్బకు వయా పెనుమూడి చాట్రగడ్డ, పిరాట్లంక, గంగడిపాలెం మీదగా లంకెవానిదిబ్బకు సర్వీస్ ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సర్వీస్ రేపల్లె నుంచి ఉదయం 5.30, నుంచి 9.30, సాయత్రం 6.10నిమిషాలకు రేపల్లె డిపో నుంచి సర్వీస్ తిరుగుతుందని తెలిపారు. అదే విధంగా లంకెవానిదిబ్బ నుంచి రేపల్లె వచ్చే సర్వీస్ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 11గంటలు, రాత్రి 7.40 నిమిషాలకు బయల్దేరునని తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న లంకెవానిదిబ్బ వయా నల్లూరుపాలెం, తుమ్మల మోళ్ళగుంట, గంగడిపాలెం సర్వీస్ యథావిధిగా తిరుగుతుందని ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించి ఆర్టీసీ అభివృద్ధికి దోహదపడాలని ఆయన కోరారు.

వికసిత్‌భారత్‌పై ప్రజలకు అవగాహన



వికసిత్ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న యువమోర్చా అధ్యక్షుడు నాళం నరేష్

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని 19, 27, 30 వార్డుల్లో యువమోర్చా అధ్యక్షుడు నాళం నరేష్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమం గురించి వివరించారు. దేశంలో కేంద్రం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులతో నాలుగులైన్‌ల నిర్మాణం, రూ.8,500 కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభానికి ప్రధాని మోదీ పునాదిరాయి వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మారం మణి, ఇమ్మడిశెట్టి రాము, బాలాజీ, సుజిత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

● ఇబ్బందుల్లో ప్రయాణికులు, విద్యార్థులు



మరమ్మతులు చేస్తూ మూసిన రైల్వే గేటు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్ కుంగడంతో మరమ్మతుల కోసం రైల్వే అధికారులు గేటు మూయడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. భట్టిప్రోలు రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే గేటు వద్ద పట్టాలు రోడ్డు లెవల్‌కి మించి కుంగిపోవడంతో బుధవారం రైల్వే శాఖాధికారులు మరమ్మతులు చేపట్టారు. దీంతో ఈ మార్గం నుంచి ప్రయాణించాల్సిన రేపల్లె-విజయవాడ బస్సు సర్వీసులతో పాటు అనేక వాహనాల ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. భట్టిప్రోలు నుంచి వెల్లటూరు సమీపంలోని విశ్వశాంతి విద్యాసంస్థకు వెళ్లే విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ముందస్తు సమాచారం లేకపోవడంతో రైల్వే గేటు వద్దకు వచ్చిన వాహనదారులు సుమారు 20-25 కి.మీ చుట్టూ తిరిగి గమ్యాలకు చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో భట్టిప్రోలు, పెదపులివర్రు రహదారి మార్గంలో ఉండే రైల్వే గేటు వల్ల ఇక్కడ ఏదైన మరమ్మతులు జరిగితే అటు నుంచి ప్రయాణం సాగేది. ఆ మార్గాన్ని కూడా ఎప్పుడో మూసివేయడంతో ప్రయాణికులు కొల్లూరు, లంక గ్రామాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గురువారం కూడా ట్రాక్ మరమ్మతులు జరిగే పరిస్థితులు ఉన్నాయని రైల్వే అధికారులు నుంచి సమాచారం. మరో రోజు కూడా ప్రయాణం నిలిచిపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఎదుర్కొనక తప్పదని తెలుస్తుంది.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం వేల కోట్ల నిధులు మంజూరు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారుబాబు

రేపల్లె, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం వేలాది కోట్లు విడుదల చేసి రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొండముది బంగారుబాబు అన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ క్రియాశీలక సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఇచ్చే నిధులను రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే విషయపై ప్రజల్లోకి తీసుకుని వెళ్లి తీరప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. బాపట్ల జిల్లాలో బీజేపీని అంచెలంచెలుగా బలపరిచేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని దానికి అనుగుణంగా గ్రామ, మండల, నియోజకవర్గస్థాయి నాయకులు పనిచేయాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై రేపల్లెకు వచ్చిన సందర్భంగా బంగారుబాబును స్థానిక బీజేపీ నేతలు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఇంకొల్లు మాణిక్యరావు, మత్స్యశాఖసంక్షేమశాఖ బోర్డు డైరెక్టర్ విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు, నాంపల్లి జగన్నాథశాస్త్రి, వి.శివరామప్రసాద్, పిన్నిసాంబశివరావు, జై సురేష్, బి.వెంకటేశ్వరరావు, పి.సత్యసాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

రేపల్లె, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని వెంటనే తగ్గించాలని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నెహ్రూ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఎన్నికల ముందు గ్యాస్ ధర కొంతమేర తగ్గించి ఇప్పుడు మూడో సారి అధికారంలోకి వచ్చిన తరువాత గ్యాస్ సిలెండర్ ధర రూ.50లు పెంచటమంటే ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. దేశంలో కార్పోరేట్ వ్యాపారవేత్తలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ కష్టజీవులు, పేదలు, రోజువారి ఉపయోగించుకునే గ్యాస్ ధరలు పెంచటం సిగ్గుచేటని అన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్‌ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కేవీలక్ష్మణ్‌రావు, కె.ఆశీర్వాదం, వై.కిషోర్, కె.గోపి, కో.రమేష్, నాంచారమ్మ, డానియేలు,బాబూరావు, తదితరులు పాల్గొన్నారు

భట్టిప్రోలు(కొల్లూరు), (ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని వాగ్దానం చేసిన బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో లెక్కలేనన్ని సార్లు గ్యాస్, డిజిల్, పెట్రోల్ ధరలతో పాటు నిత్యావసర ధరలు పెంచుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు తగ్గుతుంటే భారతదేశంలో మాత్రం వాటి ఉత్పత్తులైన గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలను పెంచి ప్రజలపై కోట్లాది రూపాయల భారాన్ని మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పెంచిన ధరలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు డి.శ్రీనివాసరావు, గోగులశెట్టి రమేష్, దాసరి నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం పెరుగుతుంది

● ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం జె.మోహన్

కర్లపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం వల్ల పంట పెట్టుబడి తగ్గి రైతుకు ఆదాయం పెరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం జె.మోహన్ అన్నారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ ఆధ్వర్యంలో మండల స్థాయి వ్యవసాయశాఖల సమన్వయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రకృతి సాగులో ఉత్తమ రైతులు పిట్టు రామకృష్ణారెడ్డి, బొమ్మిశెట్టి చలపతి శ్రీనివాస్‌నలను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఏడీఏ లక్ష్మీ, ఏవో సుమంత్‌కుమార్, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి గ్రామ వ్యవసాయ సహాయకులు సీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

అమృతలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ప్రాజెక్టు అధికారి నాగశ్రీ తెలిపారు. బుధవారం మండలపరిధిలోని ప్యాపర్రులో రాష్ట్ర కమ్యూనిటీ మానేజెడ్ న్యాచురల్ ఫార్మింగ్ మండల ప్రణాళిక 2025 మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగశ్రీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను గుర్తించి వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించుటకు వీఏఏలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, ఏడీఏ శ్రీకాంత్, సర్పంచ్ హేమ చంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

కర్లపాలెం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కర్లపాలెం పంచాయతీ పరిధిలోని లంక కాల్వ సమీపలోని జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల హాజరును పరిశీలించి పనులను నాణ్యతగా చేయాలని సూచించారు.

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే నరేంద్రవర్మ



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలను నేరుగా కలుసుకొని వారి సమస్యలను స్వయంగా విని చిత్తశుద్ధితో వాటిని పరిష్కరించటానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలు అర్జీల ద్వారా వారి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ప్రతి ఒక్కరి సమస్యను తెలుసుకొని పరిష్కరించేదిశగా పనిచేస్తానని హామినిచ్చారు. బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతిగ్రామాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో పనిచేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మందపాటి ఆంధ్రేయ, షాలేంరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖాధికారుల ఆకస్మిక తనిఖీలు



విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న తెనాలి ఏడీఈ చిరంజీవి

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు లోడుకు సంబంధించిన టారిఫ్‌ను ఎంచుకుని విద్యుత్‌ను వినియోగించుకోవాలని తెనాలి విద్యుత్‌శాఖ ఏడీఈ చిరంజీవి తెలిపారు. బుధవారం డివిజన్ పరిధిలోని 120 సిబ్బందితో భట్టిప్రోలు మండలంలో 4700 పైచిలుకు విద్యుత్ సర్వీసులను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 66 మంది లోడ నియంత్రణ లేకుండా విద్యుత్ వినియోగం చేస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. ఆయా వినియోగదారులకు రూ.2.90 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు ఏడీఈ తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న గృహాన్ని గుర్తించి రూ.4 వేలు అపరాధ రుసుం విధించామన్నారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లు వినియోగిస్తున్న మరో ఐదుగురికి రూ.47 వేలు జరిమానా విధించారన్నారు. అనధికార విద్యుత్ వాడకం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వాటికి పాల్పడే వారిని గుర్తించి భారీగా జరిమానాలు విధిస్తామన్నారు. జరిమానాలు చెల్లించని వారి సర్వీసులు కూడా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించిన పొరపాట్లు చేయరాదన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ డిప్యూటీ ఇంజనీర్ ఎస్ఎం ప్రసాద్, రేపల్లె డిప్యూటీ ఇంజనీర్ డీ శ్యాంసుధాకర బాబు, ఏఈ శాంతకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదులు



ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమానికి 30 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ భూసమస్యలపై అర్జీలు వచ్చాయి. కొన్నిగ్రామాల నుంచి శ్మశానవాటికల అభివృద్ధి, రహదారుల అభివృద్ధి, పింఛన్లు, రేషన్‌కార్డుల సమస్యలు భూసంబందితమైన అడంగల్‌లో పేర్లు నమోదు తప్పుల తడకలు, ల్యాండ్ సర్వే గురించి ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రతి అర్జీని వీలైనంత త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదు ఆయా శాఖల అధికారులకు అందజేసి వాటిని నిర్దిష్ట సమయంలో పరిష్కరించే విధగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రా సూర్యరాజు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, బొర్రా సురేంద్ర, వాకా చిరంజీవి,హైమా, తదితరులు పాల్గొన్నారు.

రైతులు నూతన సాంకేతికతను వినియోగించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కాలేజీ అసోసియేట్ డీన్ డీడీ స్మిత్

చెరుకుపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆరుంబాక మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో డాక్టర్ ఎన్‌టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల, ప్రాజెక్ట్ సంస్థవారు అఖిలభారత వ్యవసాయ పరిశోధన గిరిజన ఉపప్రణాళిక వారి సౌజన్యంతో హైడ్రోఫోనిక్స్ సాంకేతిక సాగు, నర్సరీ మేనేజ్‌మెంట్‌పై క్షేత్రప్రదర్శన.. శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాలేజీ అసోసియేట్ డీన్ డీడీ స్మిత్ మాట్లాడుతూ రైతులు ఈకొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలని కోరారు. ఇక్కడ ప్రదర్శించిన ఏరో టవర్లు, ఎన్ఎఫ్‌టీ ట్రక్కర్లు వాటి ప్రావీణ్యం గురించి రైతులకు వివరించారు. యూనివర్సిటీ నుంచి ఎటువంటి సాయం అయినా రైతులకు చేస్తామన్నారు. నర్సరీ మేనేజ్‌మెంట్‌పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రవిబాబు, ఎస్ చంద్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ హేమకుమార్, చైతన్య పాల్గొన్నారు.


పరామర్శ పేరుతో జగన్ బయోత్పాతం : కొల్లా

బాపట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ తమ పార్టీకి చెందిన లింగమయ్య హత్య సందర్భంగా పరామర్శకు వచ్చి పోలీసులను బట్టలూడదీయించి ఉద్యోగాలు నుంచి ఊడపీకుతామని బీరాలు పలకటం పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే దుర్మార్గమే అవుతుందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ హెలీప్యాడ్ ప్రాంతాన్ని దిగ్బంధం చేసే ముందస్తు కుట్రతోనే వేలాదిమంది వైసీపీ మూకలను ఉసిగొల్పారన్నారు. పార్టీకి చెందిన వ్యక్తి హత్య జరిగితే పార్టీ కార్యకర్తలు సంతాపం ప్రకటిస్తారు కాని పోలీసులను, బారికేడ్లను తోసేసి ఈలలు, కేకలతో భయానక వాతావరణం సృష్టించడమేమిటని కొల్లా ప్రశ్నించారు.

జిల్లాలో కొత్త తరహా మోసాలు జరుగుతోన్నాయి. ప్రజల అమాయకత్వాన్ని ఉపయోగించుకుంటూ చీటింగ్‌లకు పాల్పడే గ్యాంగ్‌లు పుట్టుకొస్తున్నాయి. ఇప్పటివరకు బ్యాంకులు/ఏటీఎంల వద్ద దొంగలు మాటు వేయడం, ద్విచక్ర వాహనాల డిక్కీల్లో దాచిన నగదుని దొంగిలిం చడం, టూవీలర్ పైనుంచి పడిపోతున్నట్లు నటిస్తూ పైకి లేపమని సహాయం కోరి పైజేబులో ఉన్న సెల్‌ఫోన్లు తస్కరించడం, నగలకు మెరుగు పెడతామంటూ ఇళ్ల వెంట వచ్చి మహిళలను మోస గిస్తున్న గ్యాంగులను చూశాం. తాజాగా అమాయక రైతుల ముసు గు ధరించి తక్కువ ధరకే నాణ్యమైన బీపీటీ బియ్యం ఇస్తామని చెప్పి మెల్లగా వారి మాయమాటలు నమ్మేలా చేసి తూకంలో కనికట్టు చేసి నిలువునా మోసగిస్తున్నారు.

రైతు వేషం.. కొలతల్లో మోసం

● ఇంటింటికి బియ్యం బస్తాలతో వస్తున్న గ్యాంగ్





సీసీ టీవీలో రికార్డు అయిన రైతుల ముసుగు ధరించిన చీటింగ్ గ్యాంగ్

- వరి పంట వేసి నష్టపోయామని కాళ్లు పట్టుకుంటూ నటన
- కేజీ రూ. 48కే బీపీటీ బియ్యం ఇచ్చేస్తామని కన్నీళ్లు
- రైతులనే జాలితో కొనుగోలు చేస్తున్న అమాయక ప్రజలు
- తీరా బియ్యం కొలతతో కనికట్టు
- గుంటూరు పోలీసులకు బాధితుల ఫిర్యాదు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం 9/2వ లైనులో తాజాగా వెలుగు చూసిన సంఘటనలో మూడు కుటుంబాలకు ఈ ఐదుగురు సభ్యుల గ్యాంగు 380 కేజీల బియ్యం అని చెప్పి డబ్బాతో కొలత వేసి ఇచ్చి దాదాపుగా రూ. 18 వేల నగదు తీసుకొని మెల్లగా జారుకొన్నది. రైతుల ముసుగులో ఉన్న వాళ్లు వెళ్లిన తర్వాత చూడగా తూకంలో సగానికి సగం వ్యత్యాసం కనిపించింది. దీంతో బాధితులు నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించి ముఠా తీసుకొచ్చిన వాహనాల నంబరు ప్లేట్లలో రిజిస్ట్రేషన్ నంబర్లు కనిపించడం లేదని చెప్పి వెళ్లిపోయారు.

ఏదైనా వస్తువు/సరుకులు తక్కువ ధరకు వస్తున్నాయంటే చాలామంది వాటిని కొనుగోలు చేసేందుకు తలొగ్గుతుంటారు. తాము కొనుగోలు చేయదలిచిన వస్తువుని ఎందుకు మార్కెట్ కంటే తక్కువ ధరకు ఇస్తున్నారన్న చిన్న విషయాన్ని అసలు పట్టించుకోరు. ఈ క్రమంలో మోసగాళ్లు వాళ్లని ఆలోచన కూడా చేసుకోనీయకుండా తమ విద్యని ప్రదర్శిస్తుంటారు. గుంటూరు నగరంలో విద్యావంతులు, ఉద్యోగస్తులు ఎక్కువగా ఉన్న ఏటీ అగ్రహారంలో దొంగలు తమ ప్రతాపాన్ని ప్రదర్శించారు. గత వారంలో తలపాగ, లుంగీలు ధరించి అచ్చం రైతుల వలే ఇంటింటికి వెళ్లారు. తాము తెనాలి పక్కన గ్రామం నుంచి వస్తున్నామని చెప్పి ఈ ఏడు వరి పంట సాగు చేసి నష్టపోయామని కళ్ల నీళ్లు పెట్టుకొన్నారు. తాము పండించిన ధాన్యాన్ని మిల్లుకు ఇచ్చి బియ్యం తీసుకొన్నామని, బయట మార్కెట్‌లో కేజీ రూ. 60 పైగానే ఉన్నాయని చెప్పారు. తాము కేవలం రూ. 48కే ఇస్తామని, బియ్యం నాణ్యత నంబరు. 1 అన్నారు. కావాలంటే వండి చూసుకోవాలని కొంత బియ్యం ఇచ్చి అక్కడే ఉన్నారు.

ఇది నిజమేనని నమ్మిన మూడు కుటుంబాలు బియ్యాన్ని అప్పటికప్పుడు నానపోసి వండాయి. అన్నం పొడిపొడి లాడటంతో క్వాలిటీ బియ్యం అని నమ్మి 25 కేజీలు చొప్పున ఇవ్వమన్నారు. అందుకు ఆ ఐదుగురు మోసగాళ్లు అయ్యా... అయ్యా మీ కాళ్లు పట్టుకొంటామంటూ వారి పాదాల మీద పడి తమ వద్ద 380 కేజీలున్నాయని... అంతా తీసుకోవాలని ప్రాధేయపడ్డారు. బియ్యాన్ని ఎలాంటి పురుగు పట్టదని నమ్మించారు. దాంతో ఒక వ్యక్తి 85 కేజీలు, మరోకొరు 165 కేజీలు, మరొకరు 130 కేజీల బియ్యాన్ని కొనుగోలు చేశా రు. ఆ సమయంలో వారిలో ఒకరి వద్ద నగదు లేకపోవడంతో మోసగాళ్లలో ఒక వ్య క్తి తన వాహనం ఎక్కించుకొని మరీ ఏటీఎం వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు బియ్యంని వాళ్ల వెంట తెచ్చుకొన్న డబ్బాతో కొలత వేస్తూ కనికట్టు చేశారు. మోసగాళ్లు ఉన్నంత సేపు బాధితులు తూకంలో మోసగిస్తున్నారన్న విషయాన్ని గ్రహించలేకపోయారు. వాళ్లు వెళ్లిన కొన్ని గంటల తర్వాత బియ్యం బస్తాలు చిన్నవిగా ఉండటం చూసి కాటా వేయించగా సగానికి సగం వ్య త్యాసం వచ్చింది. మొత్తం మీద 190 కేజీలు మాత్రమే తూగా యి. తాము నిలువునా మోసపోయామని గ్రహించి ముగ్గురు బాధితులు నగరంపాలెం పోలీసుస్టేష న్‌లో ఫిర్యాదు చేయగా ఒక కానిస్టేబుల్‌ని సీఐ పంపించారు. ఆ కానిస్టేబు ల్ వచ్చి సీసీ టీవీ ఫుటేజ్‌ని పరిశీలించి వాహనాల నంబర్లు సరిగా కనిపించడం లేదని వెళ్లిపోయారు. ఇలాంటి సంఘటనలే జిల్లాలో మరికొన్ని చోట్ల జరిగినట్లు తెలిసింది.

అడ్మిషన్ల కోసం ఆరాటం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంపే లక్ష్యంగా అధ్యాపకులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 25 పైగా ఉండగా ప్లస్ టు కళాశాలలో మరో 30 వరకు ఉన్నాయి. ఆయా కళాశాలలో అడ్మిషన్లు కోసం ఈ ఏడాది జనవరి నుంచే అధ్యాపకులు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు .పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థుల ఇంళ్ళ వద్దకు వెళ్లి వారి పూర్తి వివరాలుసేకరించారు. ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఇక్కడ ఉన్న సౌకర్యాలు, బోధన తీరు, గత సంవత్సరాల్లో సాధించిన ఫలితాలు తదితర వివరాలు వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

గుంటూరు (విద్య) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు దాదాపు 60 వేల మందికి పైగా ఉన్నారు. ఆయా విద్యార్థుల్లో అత్యధికమంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే. కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఫీజు రూ 30 వేల నుంచి రూ 1.25 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ కళాశాలకు దీటుగా మెరుగైన శిక్షణ ఇచ్చి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనేక సౌకర్యాలు

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. ఇబ్బడి ముబ్బడిగా విద్యార్థులను చేర్చుకోకుండా తరగతికి 40 మంది ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు .ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మధ్యాహ్న భోజనం తో పాటు విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, ఎంసెట్ పరీక్ష కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అర్థ సంవత్సరం పరీక్షల పూర్తికాగానే ఆయా ప్రవేశ పరీక్షలకు విద్యార్థుల్ని తయారు చేసేలా అధ్యాపకులు ప్రత్యేక ప్రణా ళిక సిద్ధం చేసుకుని శిక్షణ అందిస్తున్నారు. గత ఏడాది జేఈఈ మెయిన్స్ కోసం ప్ర త్యేకంగా గుంటూరులోని ప్రభుత్వ బా లికల జూనియర్ కళాశాలలో నోడల్ సెంటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిం చింది. దీని ద్వారా జిల్లాలోని అన్ని కళాశాలలకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించేలా ఏర్పాటు చేస్తున్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు

విద్యార్థుల సమాచారంసేకరణ

పది ఫలితాలు రాగానే ఆన్‌లైన్ అడ్మిషన్లు



అడ్మిషన్ కోసం విద్యార్థులు ఇంటి వద్ద ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

పది విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్

పదో తరగతి పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బ్రిడ్జి కోర్స్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు మారిన సిలబస్ ప్రకారం ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలు ఇంటర్ విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందించి ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్స్ నిర్వహించనున్నారు. దీనివల్ల ఇంటర్లో సబ్జెక్టులు సులభంగా అర్థమయ్యే అవకాశం ఉందని చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు లక్ష్మణరావు ఆంధ్రజ్యోతికి వివరించారు. ప్రధానంగా గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ ,బోటనీ, సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం రూపొందించారు. ఇప్పటివరకు స్టేట్ సిలబస్లో చదివిన విద్యార్థినీ విద్యార్థులకు ఎన్సీఈఆర్టీ సిలబస్ పుస్తకాల సబ్జెక్టు అర్థమయ్యేలా బ్రిడ్జి కోర్సును రూపొందించారు. పదో తరగతి ఫలితాలు రాగానే ఆన్‌లైన్ అడ్మిషన్స్ నిర్వహించేలా ఇంటర్ బోర్డు ఏర్పాటు చేస్తోంది. విద్యార్థులు నేరుగా వెబ్ సైట్ వెళ్లి తమ అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశం కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంపే లక్ష్యంగా ఇంటర్ బోర్డు అధికారులు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషితో ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అమరావతి రాజమార్గాలకు టెండర్లు

రాజధానిలో ఈ - 13, ఈ - 15 రోడ్ల విస్తరణకు టెండర్లు

కురగల్లు నుంచి మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్ - 16 వరకు ఈ - 13 రోడ్డు

ఈ 13 రోడ్డుకు రూ. 70 కోట్ల వ్యయంతో టెండర్లు

నిడమర్రు నుంచి మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్ - 16 వరకు ఈ - 15 రోడ్డు

సీడ్ యాక్సెస్ రోడ్డుకు రైతుల నుంచి సహాయ నిరాకరణతో .. ప్రత్యామ్నాయ రాజమార్గాల అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) అమరావతి ప్రధాన రాజమార్గాలకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) టెండర్లు పిలిచింది. కురగల్లు నుంచి ఈ - 13, నిడమర్రు నుంచి ఈ - 15 రోడ్లను అమరావతి ప్రధాన రాజమార్గాలుగా పదహారవ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16)కు అనుసంధానించేందుకు టెండర్లు పిలిచింది. అమరావతి రాజధానికి ప్రధాన రాజమార్గంగా సీడ్ యాక్సెస్ రోడ్డును అభివృద్ధి చేసినప్పటికీ .. దీనిని ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానం చేయటంలో సమస్యలు ఏర్పడ్డాయి. స్థానిక ఉండవల్లి రైతులు కొందరు భూములు ఇచ్చే విషయంలో అభ్యంతరాలు లేవనెత్తుతున్నారు. సహాయ నిరాకరణ చేపడుతున్నారు. దీంతో సీడ్ యాక్సెస్ రోడ్డు మొదటి ఫేజ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. రెండో ఫేజ్ పనులు ఉండవల్లి నుంచి మణిపాల్ హాస్పిటల్ మీదుగా కనకదుర్గ వారధి దిగువన ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానించాల్సి ఉంది. ఇక్కడి ఉండవల్లి రైతుల సహాయ నిరాకరణ కారణంగా సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో ఫేజ్ పనులు చేపట్టడం ఇప్పట్లో కష్టంగా ఉంది. సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూములు తీసుకునే విషయంలో దాదాపుగా 40 కేసులపైగా న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డును విస్తరించేందుకు ఇంతకు ముందు మంత్రి నారాయణ రైతుల ఇంటికి వెళ్ళి విజ్ఞప్తి చేశారు. కొంతమంది సహకరించినా.. మరికొందరు సహకరించలేదు. తమవి ఖరీదైన భూములు కాబట్టి ప్యాకేజీ పెంచాలని మరికొందరు డిమాండ్ చేశారు. ప్యాకేజీ అనేది ఎవరికైనా సమానంగా ఉండాలన్నది ప్రభుత్వ నిర్ణయం. కొంతమందికి ఎక్కువగా ఇచ్చి.. మరికొందరికి తక్కువగా ఇవ్వటం తప్పుడు సంకేతాలను ఇస్తుందన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం కూడా తాను అనుకున్న ప్రకారం కట్టుబడి ఉంది. ఎన్నో దఫాలు రైతులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇప్పటికీ సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. రాజధానిలో రూ. 41 వేల కోట్ల మేర వివిధ ప్రాజెక్టుల పనులకు టెండర్లు పిలిచినప్పటికీ .. రాజధానికి రాజమార్గాల అంశం తేలటం లేదు. దీంతో ఏడీసీ అధికారులు ప్రత్యామ్నాయంగా ఈ - 13, ఈ - 15 రోడ్లను ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానించి అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ - 13 రోడ్డును కురగల్లు నుంచి 7.29 కిలోమీటర్ల మేర మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్ - 16కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఈ - 15 రోడ్డును నిడమర్రు నుంచి మంగళగిరి మీదుగా 3.52 కి లో మీ టర్ల మేర ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానించాలని నిర్ణయించారు. ఈ రెండు రోడ్లకు సంబంధించి ఏడీసీ అధికారులు తాజాగా టెండర్లు పిలిచిరు. ఈ - 13 రోడ్డును రూ. 70 కోట్ల వ్యయంతో వరదనీటి కాలువలతో సహా నిర్మించేందుకు టెండర్లు పిలవటం జరిగింది. ఈ - 15 రోడ్డును రూ. 384.76 కోట్ల వ్యయంతో టెండర్లు పిలవటం జరిగింది. ఈ రెండు ప్రధాన రాజమార్గాలను రెండేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.



చినగంజాం మండల పరిధిలో ఆక్వా సాగు

ఆక్వా.. ఆందోళన

- ట్రంప్ దెబ్బకు విలవిల
- పన్నుపోటుతో దిగజారిన రొయ్యల ధరలు
- భారీ నష్టాలు తప్పవని సాగుదారుల్లో భయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆక్వా రంగంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రూపంలో సుంకాల విపత్తు వచ్చిపడింది. దీంతో ఆక్వా సాగు చేయడంపై రైతులు పునరాలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. రొయ్య ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా 26 శాతం పన్నులు విధించడంతో ధరలు పతనమయ్యాయి. అసలే తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ఆక్వా రంగం ట్రంప్ దెబ్బకు విలవిలలాడుతోంది. ఆక్వా రంగానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వం చెబుతున్నా రైతులు మాత్రం అమెరికా పన్నుల ప్రభావంతో నష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆక్వా సాగుకు సంబంధించి ఏడాదికి రెండు నుంచి మూడు పంటలు తీస్తుంటారు. ప్రధానంగా జనవరి నుంచి మే, జూన్ నుంచి అక్టోబరు సీజన్ల మీదనే ఆక్వా రైతులు దృష్టి సారిస్తారు. అమెరికా విధించిన సుంకాల ప్రభావంతో రొయ్యల ధరల్లో ఇప్పటికే తిరోగమనం మొదలైంది. జూన్ నుంచి ప్రారంభమయ్యే సీజన్‌లో సాగుపై ఆక్వా రైతులు పునరాలోచనలో పడ్డారు. పూర్తిగా క్రాప్ హాలిడే తీసుకోకపోయినా సాగు విస్తీర్ణంలో మాత్రం గణనీయంగా కోత పడే సూచనలు ట్రంప్ పన్నుల ప్రభావం వల్ల కనబడుతోంది.

జిల్లాలో 22,500 ఎకరాల్లో రొయ్యల సాగు...

బాపట్ల జిల్లా వ్యాప్తంగా 22,500 ఎకరాల వరకు రొయ్యల సాగు జరుగుతోంది. దిగుబడుల్లో దాదాపు 90 శాతం విదేశాలకే ఎగుమతి అవుతున్నాయి. జిల్లా నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల విలువ ఏడాదికి రూ.850 కోట్లు కాగా ఇందులో అమెరికా వాటా దాదాపు 45 శాతం వరకు ఉండడమే ఆక్వా రంగం కలవరపాటుకు కారణంగా ఉంది. రెండు వారాల క్రితం వరకు వంద కౌంట్ కిలో ధర రూ.250గా ఉండగా ప్రస్తుతం రూ.40 తగ్గుదల నమోదైంది. పెద్ద కౌంట్ రొయ్యలే ఎక్కువగా అమెరికాకు ఎగుమతి అవుతుంటాయి. 30,40 కౌంట్ రొయ్యల ధరల్లో కూడా పతనంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదే పరిస్థితి కొనసాగితే...

ఈ పన్నుల నిర్ణయం వెలువడక ముందు ప్రభుత్వం తీసుకుంటున్న ఉద్దీపన చర్యల వల్ల జిల్లాలో ఆక్వా సాగు పెరుగుతుందనేది అంచనాగా ఉంది. కానీ ట్రంప్ నిర్ణయంతో ఆ అంచనాలు ఒక్కసారిగా తారుమారవడంతో పాటు ఏటా సాగయ్యే విస్తీర్ణంలోనే నాలుగు నుంచి ఐదు వేల ఎకరాల వరకు తగ్గుదల నమోదయ్యే అవకాశాలు కనబడుతున్నాయి. ముమ్ముందు రొయ్యల ధరలు మరింతగా క్షీణిస్తే ఆక్వా క్రాప్ హాలీడే దిశగా వెళ్లిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని రైతాంగం వ్యక్తం చేస్తోంది. చిన్న, సన్నకారు రైతులపై పన్నుల ప్రభావం భారీగా ఉండొచ్చని తెలుస్తోంది. జిల్లాలో సాగు విస్తీర్ణంలో దాదాపు 75 శాతం వాటా చిన్న రైతులదే కావడం గమనార్హం. ఇదిలా ఉంటే జిల్లాలో ఆక్వా రంగంపైనే ఆధార పడి ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు పదివేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఆక్వా రంగం తిరోగమన బాట పడితే ఇందులో సగం మంది జీవనోపాధి ప్రశ్నార్థకం కానుంది. అయితే విదేశాలకు రొయ్యల ఎగుమతి విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా దృష్టి పెట్టామని పాలకులు చెబుతున్నారు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఇప్పటికే విద్యుత్ రాయితీని ప్రకటించామని, పరిస్థితులన బట్టి అవసరమైతే మరిన్ని ప్రోత్సాహక చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం భరోసా ఇస్తోంది.

ఆక్వా రైతుల పాలిట శాపమే..



అమెరికా విధించిన సుంకాలు కచ్చితంగా ఆక్వా రైతుల పాలిట శాపం లాంటిదే. 26 శాతం అని చెబుతున్నారు కానీ మొత్తంగా చూస్తే ఇది 27 శాతం వరకు పన్నులు పడే అవకాశం ఉంది. ఐదేళ్ల నుంచి అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. కొంచెం గాడిన పడే సమయానికి ఇది వచ్చి పడింది. ప్రభుత్వం కేంద్ర పెద్దలతో చర్చలు జరిపి రైతులకు మేలు చేసే నిర్ణయం వచ్చే విధంగా చూడాలి

-బి. రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ సీఫుడ్ సప్లయిర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు

వెలగపూడిలో జోష్



వెలగపూడి గ్రామ ఏరియల్ వ్యూ

● సీఎం చంద్రబాబుది మా ఊరేనని సంబరాలు ● మా ఇంటి ముందు నుంచే వెళతారంటూ ఒకరు.. ● మా ఇంటి పక్కనేనంటూ మరొకరు ఉబ్బితబ్బిబ్బు ● ఇంటి నిర్మాణంతో రాజధానికి కొండంత అండని ఆనందం

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరా వతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇల్లు కట్టుకునేందుకు సిద్ధమవడంతో అమరావతి ప్రజల ఆనందానికి హద్దులే లేకుండా పోయాయి. అందులోనూ వెలగపూడి వాసులైతే పట్టలేనంత ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతున్నారు. ఎందుకంటే ఎప్పుడోగానీ కనిపించని ముఖ్యమంత్రి ఇక ఎప్పుడూ తమతోనే ఉంటారన్న ఆనందం వారిని నిలువనీయడం లేదు. 3,500 మంది జనాభా ఉండే వెయ్యి గడపల చిన్న ఊరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం ఏర్పాటు చేసుకోనుండటంతో ఆ ఊరు వారందరికీ పట్టరాని సంతోషంగా ఉంది. చంద్రబాబు ఇంటి శంకుస్థాపన సందర్భంగా బుధవారం వెలగపూడిలో అదే కనిపించింది. చంద్రబాబు ప్రతి రోజూ మా ఇంటి ముందు నుంచే వెళ్లాలి.. చంద్రబాబు ఇంటి పక్కనే మా ఇల్లు.. చంద్రబాబు.. మేమూ ఒకే బజారు అని చెప్పుకోవచ్చు.. అంటూ ఎవరికి తోచిన రీతిలో వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ బంధువులకు, మిత్రులకు ఫోన్లు చేసి మరీ ఈ విషయాలు చెప్పుకుంటున్నారు.

రైతుల మాటల్లో నిబ్బరం..

గడిచిన ఐదేళ్లలో అమరాతి రైతులు నరకం అనుభవించారు. రాజధాని కోసం భూములివ్వడమే నేరంగా గత ప్రభుత్వం కక్ష సాధించింది. 1600 వందల రోజుల పాటు రైతులు నిత్యనరకం అనుభవించారు.ప్రభుత్వం మారి రైతులకు మంచి రోజులు వచ్చాయి. కానీ ఏదో ఒక మూల వారికి భయం పోలేదు.. మళ్లీ ఆ చీకటి రోజులు ఎక్కడ వస్తాయో.. తమను ఏం చేస్తాయోనన్న ఆందోళన వారిలో కనిపిస్తూనే ఉంది. ఆ ఆందోళనను పటాపంచలు చేసేలా చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో వారి మధ్యలోనే నివాసం ఉండేందుకు సిద్ధమవడం వారికి కొండంత ధైర్యాన్ని ఇచ్చింది.

● చరిత్రాత్మక కుటుంబం నుంచి స్థలం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇంటి స్థలం అమ్మిన కుటుంబానికి ఆ ప్రాంతంలో గొప్ప చరిత్ర ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో వెలగపూడి సర్పంచ్‌గా కంచర్ల శాంతకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాంతకుమారి మామ కంచర్ల అంజయ్య 1957లో 18 కిలోమీటర్ల కరకట్ట నిర్మాణానికి కృషి చేశారు. అప్పటి నుంచి ఆయన పేరు కరకట్ట అంజయ్యగా ఈ ప్రాంత ప్రజలు పిలుస్తారు. గతంలో రాష్ట్ర సచివాలయ శంకుస్థాపన సమయంలో కరకట్టకు అంజయ్య పేరు పెట్టాలని వారి కుటుంబసభ్యులు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. కాగా శాంతకుమారి, ఆమె భర్త కంచర్ల సాంబశివరావు రాజధాని కోసం 25 ఎకరాలకు పైగా భూములు ఇచ్చి రిటర్నబుల్ ప్లాటును తీసుకున్నారు. ఆ ప్లాటు ఇప్పుడు సీఎం చంద్రబాబు నివాసానికి ఉపయోగపడడంపై వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


చంద్రబాబు ఇంటికి దక్షిణంగా మా స్థలం



చంద్రబాబు కట్టుకునే ఇంటికి దక్షిణ వైపున నాకు 9000 గజాల ప్లాటు ఉంది. రైతుల పక్కనే సీఎం చంద్రబాబు ఇల్లు కట్టుకోవడం ఆనందంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేసింది. సీఎం వచ్చి అమరావతిని నిలబెట్టారు.

-కారుమంచి సూరిబాబు

చంద్రబాబు ఇంటికి ఆగ్నేయంగా మా ప్లాటు



చంద్రబాబు ఇంటికి దక్షిణ ఆగ్నేయం వైపు నాకు 630 గజాలు ప్లాటు ఉంది. మా గ్రామంలో చంద్రబాబు ఇంటికి శంకుస్థాపన చేయడం మా అందరికీ పండగలా ఉంది. గత 8 ఏళ్ల నుంచి వెలగపూడి రెవెన్యూలో కట్టిన రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర పాలన జరగడం సంతోషంగా ఉంది. ఇదే రెవెన్యూలో చంద్రబాబు ఇల్లు కట్టుకోవడం చాలా సంతోషం.

-నాయుడు నాగేశ్వరరావు

మా స్థలం కొనుక్కోవడం సంతోషం



ఇల్లు కట్టుకోవడానికి స్థలం కావాలి.. అమ్ముతారా అంటూ చంద్రబాబు నుంచి సమాచారం వచ్చింది. ఆ సమాచారం రాగానే ఎంతో సంతోషపడ్డాం. చంద్రబాబు విజన్‌ను నమ్మి రైతులు 33వేల ఎకరాలు ఇచ్చారు. అలాంటి నాయకుడికి మా స్థలం నచ్చడం సంతోషంగా ఉంది.

-కంచర్ల శాంతకుమారి, మాజీ సర్పంచ్



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్లు

కౌన్సిల్ సమావేశం మమ

- మూడు నిమిషాల్లో ముగిసిన వైనం
- 41 అంశాలకు ఆల్ పాస్
- అలా వచ్చారు.. ఇలా వెళ్లారు

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాసం నేపథ్యంలో ఇటు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ వర్గం కౌన్సిలర్‌లు, అటు టీడీపీ కూటమి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య వర్గం కౌన్సిలర్‌లు కారాలు మిరియాలు నూరుకున్నారు. ఈక్రమంలో బుధవారం నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అసలు ఎవరు ఏయే అంశాలపై మాట్లాడతారో...వాటిపై ఏవిధంగా మిగిలిన వారు స్పందిస్తారోనని అందరిలోనూ ఒకింత సందిగ్ధత నెలకొంది. అయితే బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం అందరినీ నివ్వెర పోయేలా చేసింది. సభ ప్రారంభమైన మూడు నిమిషాలకే అజెండాలో ప్రవేశపెట్టిన 41 అంశాలను ఆల్‌పాస్‌గా ప్రకటిస్తూ మమ అంటూ ముగించారు. దీంతో అందరూ అవాక్కయ్యారు. అయితే సమావేశం అనంతరం యథారాజా తథా ప్రజా అన్నట్లుగా వైసీపీ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు వారి కౌన్సిలర్‌లతో కలిసి అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్‌ను కలిసి కమిషనర్‌పై ఫిర్యాదు చేశారు. అయితే ఇది ఎటువైపు మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సిందే.

13న పూర్వ విద్యార్థుల సమావేశం

బల్లికురవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ ఉన్నత పాఠశాలలో 1980లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 13వ తేదీన జరుగుతుందని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈసందర్భంగా అప్పట్లో తమకు చదువులు చెప్పిన గురువులను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరిస్తామని వారు తెలిపారు. 1980లో బల్లికురవ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎక్కడ ఉన్నా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ ఈఈ జాన్ థామస్ పేర్కొన్నారు. మండల పరిధిలో బుధవారం విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 34 బృందాలుగా ఏర్పడి 3101 సర్వీసులను తనిఖీలు చేశారు. ఈక్రమంలోనే 110 కేసులు నమోదు చేసి రూ.5.19లక్షల అపరాధ రుసుము విధించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్, డీఈఈ హరి ప్రసాదరావు, రమేష్, ఏఈఈ భాస్కరరావు, ఏఈలు పాల్గొన్నారు.

ఆధునిక అభ్యుదయ దృక్పథం పెరగాలి

చినగంజాం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో మన పండగలు, సంప్రదాయాలు, ఆధునిక అభ్యుదయ ప్రజా దృక్పథం పెరగాలని ఊరూరా జన విజ్ఞాన, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఊరూరా జన విజ్ఞానం, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ప్రజా సంఘాల ఐక్యవేదిక, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో రైల్వేగేటు సెంటర్‌లో ఊరూరా జన విజ్ఞానం మండల శాఖను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్షుడు మార్కాపురం వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వేలాది సంవత్సరాల చరిత్రలో పండుగల ఉత్సవాలు మన సంస్కృతిలో ముఖ్య భాగమన్నారు. ప్రకృతి ధరిత్రి పండుగలు, జాతీయ రాష్ట్ర దినోత్సవాలు, మతపరమైన పండుగలు మూడు రకాలుగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శీరామచంద్రమూర్తి, కేంద్ర కమిటీ సభ్యుడు దేవళ్ల వెంకయ్య, మండల కమిటీ సభ్యుడు బెల్లంకొండ రమేష్‌బాబు, మువ్వల వెంకటసుబ్బారావు, వెంకటకృష్ణారెడ్డి, మాచవరపు నటరాజ్, పిల్లి శ్రీనివాసరావు, వలివేటి శేఖర్, అట్ల అంజిరెడ్డి, మరుప్రోలు రత్నారెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో 83 మంది సభ్యత్వం నమోదు



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న వెంకటరత్నం

ఇంకొల్లు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ వెంకటరత్నం ఆధ్వర్యంలో ఇండియన్ రెస్‌క్రాస్‌లో 83 మందికి శాశ్వత సభ్యత్వం నమోదు చేసినట్లు వెంకటరత్నం తెలిపారు.ఈ మేరకు వారికి సభ్యత్వ నమోదు ధ్రువీకరణ పత్రాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బీఎస్ నారాయణ దుర్గాబట్ నుంచి పత్రాన్ని అందుకున్నారు. జీవిత సభ్యత్వ నమోదు నగదు మొత్తం రూ.91,300 చైర్మన్‌కు అందజేసారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఎస్‌వో పుష్పలత, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు టి.ప్రసాద్‌రెడ్డి,జామావా నటరాజు పలువురు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన సాగర్ కవాత్

వాడరేవు(చీరాల), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సాగర తీరాన పోలీసుల కవాత్ అబ్బురపరిచింది. ఈ సందర్భంగా డీఎస్పీ ఎండీ మొయిన్, రూరల్ సీఐ శేషగిరిరావు మాట్లాడు తూ తీరంలో అల్లరి మూకల ప్రభావం, అపశ్రుతులు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బుధవారం వాడరేవు నుంచి చినగంజాం వరకు పోలీసులు, మెరైన్ పోలీసులు సాగర్ కవాత్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా మాక్ డ్రిల్ నిర్వహించి జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.గురువారం కూడా కవాత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రమేష్, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సాగర తీరాన కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వచ్చే విద్యాసంవత్సరం నాటికి వైఎస్‌వో ప్రభుత్వ పాఠశాలకు అనుమతులు

ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కారంచేడు గ్రామంలోని వైఎస్‌వో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అన్ని అనుమతులు ఇవ్వనున్నట్లు గుంటూరు ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం కారంచేడులోని పాఠశాల భవనాలను పరిశీలించారు. పాఠశాల జూన్ 12న ప్రారంభమయ్యేలా చూడాలని మాజీ ఎంపీపీ యార్లగడ్డ రాఘవయ్య అధికారులను కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆయన అధికారులకు తెలియజేశారు. దీనిపై స్పందించిన ఆర్‌జేడీ 6 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధిస్తారని ఆర్‌జేడీ తెలిపారు. పాఠశాలలో విద్యా ర్థులను చేర్పించేలా గ్రామస్థులు సహకారం అందించాలని ఆయన కోరారు. యూపీ పాఠశాలలను ఆదర్శ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో పురుషోత్తం

పాఠశాలగా మార్చనున్నట్లు డీఈవో ఎస్. పురుషోత్తం తెలిపారు. పాఠశాలకు అవసరమైన తరగతి గదులను అప్పగించాలని సర్పంచ్ బాలిగ శివపార్వతి కోరారు. కార్యక్రమంలో చీరాల డిప్యూటీ డీఈవో జి.గంగాధరరావు, ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ, ఎంఈవో-2 మొలబంటి వెంకటేశ్వర్లు, సర్పంచ్ శివపార్వతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఇటీవల ఉన్నత పాఠశాలకు నోచుకోని కారంచేడు, కోట్ల విలు చేసే భూములు, భవనాలు అప్పగించినా పట్టించుకోని అధికారులు అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై నంపై అధికారులు స్పందించారు.

పూర్తికాని అదనపుతరగతి గదులు

- నాడు-నేడు కింద వైసీపీ హయాంలో చేపట్టి ఆగిన పనులు
- జూన్ నాటికి పూర్తయ్యేనా..?



మార్టూరు సంపత్‌నగర్‌లో ప్రాథమిక పాఠశాలలో నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

మార్టూరు, ఏప్రిల్ 9 : గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన అనాలోచిత పనుల కారణంగా స్కూళ్లల్లో నాడు - నేడు కింద ప్రారంభించిన అదనపుతరగతి గదుల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేసేందుకు నిధులు ఉన్నా గదుల నిర్మాణాలను మాత్రం పూర్తిచేయలేక పోయారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంతవరకు అదనపుతరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఎలాంటి ప్రణాళికను రూపొందించలేదు. గత వైసీపీ పాలలో స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నాడు - నేడు ఫేజ్-2 కింద నిధులను విడుదల చేశారు. అందులో భాగంగా మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ హైస్కూల్‌లో 23 అదనపు తరగతి గదులను నిర్మాణం చేసేందుకు సుమారు రూ.6కోట్ల నిధులను మంజూరు చేశారు. వాటిని పూర్తి చేసేందుకు ప్రతి స్కూల్‌కు నాడు - నేడు స్పెషల్ బ్యాంక్ ఖాతాను ఏర్పాటు చేశారు. వాటి ఖాతాలో సంబంధిత స్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు మంజూరైన నిధులను జమ చేశారు. అదే విధంగా అదనపు తరగతి గదుల నిర్మాణాల బాధ్యతను స్కూలు మేనేజిమెంట్ కమిటీకి కేటాయించారు. అయితే అప్పటి వైసీపీ స్కూల్ గదుల నిర్మాణాలకు అవసరమైన సిమెంటు, ఇనుము, ఇసుక తదితర వాటిని పంపిణీ చేయడానికి కొంతమంది కాంట్రాక్టర్లకు టెండర్లు ఇచ్చారు. ఆ కాంట్రాక్టర్లు స్కూల్‌లో నిర్మాణం చేసే గదులకు వాటిని సప్లయ్ చేసేవారు. కానీ అసెంబ్లీ ఎన్నికలకు 6 నెలలు ముందే వాటిని సక్రమంగా కాంట్రాక్టర్లు సరఫరా చేయకపోవడంతో ముఖ్యంగా, సిమెంటు, ఇసుకను సప్లయ్ చేకపోవడంతో స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. తద్వారా గదుల నిర్మాణాలు కోసం తెచ్చుకున్న సిమెంట్ బస్తాలు కొన్ని స్కూళ్లలో ఉండగా, ఇప్పటికి అవి నాసిరకంగా మారిపోయాయి. ఈ విషయమై వైసీపీ పాలకులు చురుకుగా వ్యవహరించకపోవడంతో ఎన్నికల ముందు నాటికి పూర్తవ్వాల్సిన గదుల నిర్మాణాలు అలానే నిలిచిపోయాయి. నేటికీ ఆ స్కూళ్లకు చెందిన నాడు - నేడు ప్రత్యేక ఖాతాల్లో మండలంలో దాదాపుగా రూ.60లక్షల వరకూ ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఏవిధంగా పూర్తి చేయాలో ఇంతవరకు స్పష్టమైన చర్యలు చేపట్టలేదు. కనీసం రాబోయే విద్యాసంవత్సరం జూన్ నాటికి గదుల నిర్మాణాలను పూర్తి చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.



మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

రహదారులు అధ్వానం

వాడరేవు(చీరాల), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చీరాల - వాడరేవు రహదారి ఘోరంగా శిథిలావస్థకు చేరింది. పలుచోట్ల పెద్ద ఎత్తున గుంతలు పడి ప్రమాదాలకు రహదారులు కోరలు చాపి ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో చిన్న, హెవీ వెహికల్స్ రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేకాకుండా వాడరేవు, రామాపురానికి పర్యాటకుల సంఖ్య అధికమే. పైగా మార్గమంతా రాత్రయితే చీకటి మయం. విద్యుత్ దీపాలు లేనే లేవు. ఈక్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం కచ్చితంగా ఉంది. ఈ రహదారుల్లో ఎంతోమంది రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు. మార్గం చీకటిగా ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అవగాహన లేమితో ప్రమాదాలు బారిన పడుతున్నారు. ఈక్రమంలో అధికారులు రహదారులకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతయినా ఉంది. పేరాల నుంచి వాడరేవు వరకు కూడా చాలానే గుంతలు ఉన్నాయి. రహదారి ప్రారంభం నుంచి హాయ్ రెస్టారెంట్ సమీపం, వాకావారి పాలెం వద్ద, కీర్తి వారి పాలెం వద్ద, వాడరేవుకు కూతవేటు దూరం వంటి ప్రాంతాల్లో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈక్రమంలో అధికారులు ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టాలి.



హాయ్ రెస్టారెంట్ సమీపంలోని వాడరేవు రహదారి



వాకావారిపాలెం వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టి

ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టిపెట్టినట్లు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం సంబంధిత అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను తగ్గించడంతోపాటు గ్రానైట్ రవాణా చేసే వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్లించేలా త్రోవగుంట నుంచి పెళ్ళూరు వరకు పశ్చిమ వైపున బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అందుకోసమే ప్రాథమికంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదే పనులు ప్రారంభించేలా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సంబంధిత శాసన సభ్యులతో సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామని మాగుంట తెలిపారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ మాట్లాడుతూ ఎస్ఎన్‌పాడులో ట్రాఫిక్ రద్దీని, గ్రానైట్ రవాణా చేసే పెద్ద వాహనాలా రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రూపొందించేటప్పుడు ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా నిర్మాణ వ్యయం, సామాజిక, పర్యావరణ, ఇంజనీరింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, జేసీ ఆర్.గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాత, అధికారులు చిరంజీవి, వెంకటనాయుడు, దేవానంద్, బాలశంకరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద తొలగించిన ధ్వజస్తంభాన్ని బయటకు తెస్తున్న ఎక్స్‌కవేటర్

శింగరకొండలో ధ్వజ స్తంభం తొలగింపు

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ధ్వజ స్తంభాన్ని బుధవారం తొలగించారు. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజ స్తంభం తొలగింపు పనులు ప్రారంభించారు. బుధవారం ధ్వజస్తంభాన్ని తొలగించి బయటకు మార్చారు. ధ్వజస్తంభం 4 దశాబ్దాల కిందట ఏర్పాటు చేయగా, ఆ సమయంలో భక్తులు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ సమయంలో వేసిన 5 పైసలు, 10 పైసలు తదితర చిల్లర నాణేలు బయట పడ్డాయి. ఈవో తిమ్మానాయుడు, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో ధ్వజ స్తంభం తొలగింపు పనులను పూర్తి చేశారు. మే 19న జరిగే మహాకుంభాభిషేకం నాటికి కొత్త ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగేలా పనులు ప్రారంభించారు.



4 దశాబ్దాల నాటి చిల్లర నాణేలు

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివార్లకు విశిష్ట పూజలు చేస్తున్న అర్చకులు

ఉప్పుటూరు (పర్చూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుటూరు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ చెన్న కేశవస్వామి వార్ల ఆలయంలో బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం బిందెతీర్థం, నిత్యహోమం, బలిహరణ, నిత్యపూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఇందుకోసం కార్యనిర్వాహక కార్యదర్శి దామా నాగేశ్వరరావు సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

మార్టూరు ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : త్వరలో ప్రకటించనున్న మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వై శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో కోరారు. అదేవిధంగా ప్రతి గ్రామ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు ఈ విషయంపై గ్రామాలలోని నిరుద్యోగులకు అవగాహన కల్పించాలని వారిని కోరారు.

డెయిరీకే ఎసరు

- పాలకేంద్రం భూములలో ప్లాట్లు
- పట్టించుకునే వారే లేకపోవడంతో బరితెగిస్తున్న రియల్టర్లు
- రూ.100 కోట్ల విలువైన స్థలాలు
- కైవసానికి కొందరి యత్నం
- ఆ ప్రాంతాన్ని పరిశీలించిన తహసీల్దార్

ఒంగోలుక్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాపు కాసేవారు లేకపోవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. కోట్ల విలువ చేసే డెయిరీ భూములను కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. పాలకేంద్రం కోసం సేకరించిన భూములలో పాగా వేసి అవన్నీ తమవి అని ప్రైవేటు వ్యక్తులు చెబుతున్నారు. కంచె దాటుకుని వచ్చి ఆయా భూములలో ఉన్న చెట్లను తొలగించడంతోపాటు ప్లాట్లు వేసేందుకు చూస్తున్నారు. అయితే విషయం తెలిసి అధికారులు స్పందించడంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళితే.. ఒంగోలులో విజయ డెయిరీ పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓ వెలుగు వెలిగిన ఒంగోలు పాలకేంద్రం ప్రస్తుతం పట్టించుకునేవారు లేక కునారిల్లుతోంది. కోట్లాది విలువైన ఆస్తులు, భూములు ఉన్నాయి. అయితే వాటిని కాజేసేందుకు అనేకమంది పొంచి కూర్చున్నారు. పాలకేంద్రం కోసం అప్పట్లో 78.10 ఎకరాలు భూమిని సేకరించి డెయిరీని, ఉద్యోగుల క్వార్టర్లు నిర్మించారు. అందులోనే పాలపొడి ఫ్యాక్టరీని స్థాపించారు. కార్యకలాపాల నిర్వహించేందుకు కార్యాలయం, ఉద్యోగుల నివాసగృహాలు, పశుగ్రాసం కోసం కొంత భూమి ఉంది. మరి కొంత భూమిలో జామాయిల్ తోటలు వేశారు. ఇలా జిల్లాలో విజయ డెయిరీ పేరుతో సుమారు 50వేల మంది పాడిరైతులు సభ్యులుగా అర్థశతాబ్దానికిపైగా విలసిల్లింది. వైసీపీ వచ్చిన తర్వాత దానిని ప్రైవేటు సంస్థ అయిన అమూల్‌కు అప్పగించారు. అక్కడ ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించారు. కొద్దిరోజుల తర్వాత నడపలేక డెయిరీని మూత వేయించారు. కర్నూల్ రోడ్డు పక్కనే ఉండటం, నగరానికి అత్యంత దగ్గరగా ఉండటంతో అక్కడ భూముల ధరలు నింగిని అంటుతున్నాయి. మొత్తం 78.10 ఎకరాల భూమి డెయిరీకి ఉంది. అయితే 2011లో డెయిరీ మొత్తం భూమిని సర్వే చేసి హద్దులు వేశారు. అలాగే అప్పటి కమిటీ చుట్టూ కంచే కూడా వేసింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం పట్టించుకునే లేకపోవడంతో ఇదే అదనుగా పాల కేంద్రం భూమలను కబ్జా చేసేందుకు కొందరు సిద్ధమయ్యారు.

పాల కేంద్రం భూముల వివరాలు

ఒంగోలు సహకార డెయిరీ కోసం అప్పట్లో పేర్నమిట్ట సమీపంలో కర్నూల్ రోడ్డు పక్కన 78.10 ఎకరాలు భూమిని సేకరించారు. రోడ్డు పక్కనే ఉన్న ఏడు ఎకరాలలో డెయిరీ నిర్మాణం చేశారు. ఉద్యోగుల నివాసాలు, ఇతర అవసరాల కోసం 12.10 ఎకరాలు కేటాయించారు. మిగిలిన భూమిలో 20 ఎకరాలు జామయిల్ తోట వేశారు. డెయిరీ వెనుక భాగం 19 ఎకరాలు, ముందుభాగం 20 ఎకరాలు ఇతర అవసరాల కోసం మిగులుగా ఉంది.

కంచే దాటి కబ్జాకు యత్నం

నాలుగు రోజుల క్రితం కొందరు వ్యక్తులు డెయిరీ కంచెను దాటి లోపలికి వచ్చి భూముల్లోని చెట్లను కొట్టారు. ట్రాక్టర్లతో రాత్రుళ్లు చదును చేస్తున్నారు. సర్వే నంబరు 140/1లో పాలకేంద్రం కోసం 5.27 ఎకరాలు భూసేకరణ చేసినట్లు రికార్డులు ఉన్నాయి. అయితే ఆ భూమిలో 2.37 ఎకరాల్లో గతంలో ప్లాట్లు వేశారని, 48 ప్లాట్లు వేయగా తాము కొనుగోలు చేసినట్లు సదరు వ్యక్తులు చెబుతున్నట్లు తెలిసింది. వారు తమ పేర్లు బయట పడకుండా ఆ భూమలు తమవే అంటూ వ్యవహారం నడుపుతున్నారు. వారే భూమిని చదును చేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాదు మరో సర్వే నంబరులో కూడా సుమారు 5 ఎకరాలు చదును చేయడానికి చెట్లు పీకించారు. ఇలా పాలకేంద్రం భూములు కబ్జా చేసేందుకు దర్జాగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కబ్జాదారులు కైవసం చేసుకోవాలనుకునే భూముల విలువ సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుదని అంచనా. అయితే విషయం తెలిసి మంగళవారం సంతనూతలపాడు తహసీల్దార్ ఆదిలక్ష్మి రెవెన్యూ సిబ్బందితో కలిసి వెళ్లి భూములను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేయించారు. ఆ భూములకు సంబంధించి హక్కుపత్రాలు ఉంటే తనకు వచ్చి చూపాలని ఆదేశించారు. అయితే ఇంతవరకు ఎవరు తహసీల్దార్ ముందుకు రాకపోవడం గమనార్హం.

భూమిని పరిశీలించాం: తహసీల్దార్ ఆదిలక్ష్మి

డెయిరీ భూములలో కొంతమంది తమకు ప్లాట్లు ఉన్నాయని చదును చేస్తున్నారని సంతనూతలపాడు తహసీల్దార్ ఆదిలక్ష్మి తెలిపారు. అయితే సర్వే నంబరు 140/1లో తమకు హక్కులు ఉన్నాయని చెప్పారని, ఇంతవరకు హక్కు పత్రాలు తీసుకు రాలేదని చెప్పారు. పాలకేంద్రం సీఈఓ ఈ విషయం జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. అయితే ప్రస్తుతం అక్కడ చదును చేసే పనులను నిలిపివేశామన్నారు.

బస్సు ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా విడుదల

- ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15 లక్షలు మంజూరు
- క్షతగాత్రులకు రెండున్నర లక్షలు
- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఏలూరి ధన్యవాదాలు

పర్చూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పసుమర్రు చిలకలూరిపేట మధ్య గత ఏడాది మేలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం బుధవారం ఎక్స్‌గ్రేషియా విడుల చేసింది. బస్సు ప్రమాద బాధిత కుంటుంబాలను ఆదుకొని అండగా నిలవాలని ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి లేఖను అందజేశారు. ఇటీవల చినగంజాం పర్యటనలో ఈ అంశాన్ని ఎమ్మెల్యే ఏలూరి మరోసారి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన సీఎం బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధిత కుటుంబాల ఖాతాలో నేరుగా జమ చేస్తున్నట్లు సీఎంవో నుంచి వెల్లడించారు. బస్సు ప్రమాదంలో చినగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన కాశీ బ్రహ్మేశ్వరరావు, లక్ష్మి, ఖ్యాతి (శ్రీసాయి), గొనసపూడికి చెందిన దావులూరి శ్రీనివాస్ మృతి చెందారు. మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.15లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.2.50లక్షల చొప్పున విడుదల చేశారు. వారిలో ముప్పరాజు దుర్గాపూజ, ముప్పరాజు వెంకట సుబ్బారావు, దొప్పలపూడి భావన, దావులూరి అంజమ్మకు ఎక్స్‌గ్రేషియా నగదు వారి ఖాతాలో జమకానున్నాయి. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు చూపిన చొరవ పట్ల ఎమ్మెల్యే ఏలూరి కృతజ్ఞతలు తెలిపారు.

అసంపూర్తిగా ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులు

- కంకరపై ప్రయాణం చేయలేక అవస్థలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- ఇదీ పంగులూరు, తూర్పు కొప్పెరపాడు మధ్య రహదారి పరిస్థితి


పంగులూరు, తూర్పు కొప్పెరపాడు మధ్య తారు వేయకుండా వదిలేసిన ఆర్అండ్‌బీ రోడ్డు

పంగులూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు, తూర్పు కొప్పెరపాడు గ్రామాల మధ్య ఆర్ అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులు అర్ధంతరంగా నిలిపి వేశారు. ఈ రెండు గ్రామాల మధ్య రోడ్డుకు ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు మూడు నెలల కిందట చేపట్టిన మరమ్మతు పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంతో ప్రజలు రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. బీటీ, రోడ్డుకు ఏర్పడిన గుంటలు సరి చేసేందుకు ఎక్స్‌కవేటర్‌తో పైభాగం మొత్తం లేపేసి తారు వేసేందుకు కంకర పరిచారు. ఈకంకరపై డస్ట్‌వేసి నీటితో తడిపి చదును చేయకుండా పనులు నిలిపేశారు. పొలం పనుల కోసం నిత్యం రాకపోకలు సాగించే తూర్పు కొప్పెరపాడు, పంగులూరు గ్రామాల రైతులు, వ్యవసాయ కూలీలు మండల కేంద్రానికి పలు పనుల నిమిత్తం వెళ్లే వారి బాధలు వర్ణణాతీతం. నెలల తరబడి పనులు నిలిచి పోవడం, పొడి బారిన కంకరపై వేగంగా నడిచే వాహనాల తాకిడికి రోడ్డును కమ్మేస్తున్న దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల వేగానికి చెదిరిన కంకర రాళ్లు చెదిరి పడి గాయాలపాలవుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు వాహనాలు పట్టీ కొట్టి ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు అనేకం రోజూ జరుగుతున్నాయి. ప్రజలు తాము పడుతున్న ఇబ్బందులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విన్నవించగా, నిలిచిన మరమ్మతు పనులు తక్షణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించి నెలలు గడుస్తున్నా పురోగతి లేని పరిస్థితి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగించలేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని నిలిచిన రోడ్డు మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఈ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా నివేశన స్థలాలు - 80, పెన్షన్ - 45, రేషన్ కార్డులు - 25 అర్జీలు అందినట్లు చెప్పారు. ప్రాధాన్యతాక్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కొద్ది రోజుల్లో నియోజకవర్గంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూసీ ఆధ్వర్యంలో జరిగే ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.


ప్రజా దర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


నంబూరిపాలెంలో కమ్యూనిటీ హాల్ ముందు పూడిపోయిన సైడ్ డ్రైన్‌లో పూడికతీతను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్ర

మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సైడ్ డ్రైన్‌లలో మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రవహించేలా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. అద్దంకి పట్టణంలోని నంబూరిపాలెం, ఆర్టీసీ కాలనీ, న్యూ ఎస్‌బీఐ కాలనీ, నాగులపాడు రోడ్డు తదితర ప్రాంతాలలో బుధవారం కమిషనర్ రవీంద్ర పరిశీలించారు. నంబూరి పాలెం లో కమ్యూనిహాల్ ముందు డ్రైన్ పూడిక తీయించారు. న్యూ ఎస్‌బీఐ కాలనీ నుండి నాగులపాడు రోడ్డులో కల్యాణ మండపం వరకు సైడ్ డ్రైన్ నిర్మాణాన్ని పరిశీలించారు. న్యూ ఎస్‌బీఐ కాలనీలో సైడ్ డ్రైన్ పై ఉన్న ఆక్రమణల తొలగించడాన్ని పరిశీలించారు.

పనిదినాలను కూలీలు వినియోగించుకోవాలి



పంగులూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జె.పంగులూరు మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా కేటాయించిన పనిదినాలను కూలీలు వినియోగించుకోవాలని ఏపీవో సంతోషం విజ్ఞప్తి చేశారు. బుధవారం పంగులూరులో విలేకరులతో మట్లాడుతూ మండలానికి ఈ ఆర్థిక సంవత్సరంలో 3,65,058 పనిదినాలు మంజూరైనట్లు తెలిపారు. ఉపాధి కూలీలు పనులను వినియోగించుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి పథకం పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఉదయం సమయంలో పనికి రాలేని వారు సాయంత్రం 3 గంటల నుంచి ఆరు గంటల వరకు పని చేసుకునే వీలుందన్నారు. ఏప్రిల్, మే, జూన్‌లో పనులు జరుగుతాయని తెలిపారు. పనులకు వచ్చేవారు ఆయా గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లను కలసి డిమాండ్ ఇవ్వాలని, ఆ విధంగా డిమాండ్ ఇచ్చిన వారు పనిలో పాల్గొనవచ్చని ఏపీవో సంతోషం తెలిపారు.

అమ్మ ఆశ్రమంలో అన్నదానం

మార్టూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆశ్రమం 6 వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆశ్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకుడు రావుల బాపయ్య, కోలలపూడి పశువైద్యాధికారి మాధవీలత కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందు పాల్గొన్నారు.

పారదర్శకంగా పెన్షనర్‌ల సేవలు

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి వివాదాలకు చోటివ్వకుండా పెన్షనర్స్ బిల్లుల విషయంలో సేవ్వందించనున్నట్లు ఎస్టీవో సయ్యద్ నిజాముద్దీన్ పేర్కొన్నారు. ఉద్యోగోన్నతిపై బాధ్యతలు స్వీకరించిన ఎస్టీవో మాట్లాడుతూ గతంలో వెయ్యికి పైగా లైఫ్ సర్టిఫికెట్‌లు పెండింగ్ ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య సుమారు 100కి పైగా మాత్రమే ఉన్నట్లు వివరించారు. సేవల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని సిబ్బందికి నిజాముద్దీన్ సూచించారు.


సయ్యద్ నిజాముద్దీన్, ఎస్టీవో

నిందితుడు పరారీకి యత్నం

- చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న పోలీసులు
- గతంలో హత్య కేసుతో సంబంధం

చీరాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి పరారీకి యత్నించాడు. దీంతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పొదిలి సర్కిల్ పరిధిలోని మర్రిపూడికి చెందిన బాలకోటిరెడ్డి బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద ఫోన్ అపహరించాడు. దీంతో వెంటనే విధుల్లో ఉన్న పోలీసులు గ్రహించి అతడిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. ఈక్రమంలో కొద్దిసేపు పోలీసులు వారి పనుల్లో నిమగ్నమైన సమయంలో పోలీసులు కళ్లు గప్పి పారిపోయేందుకు నిందితుడు స్టేషన్ నుంచి బయటకు పరుగులంకించాడు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు అతడిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అపహరించిన సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కౌన్సెలింగ్ నిర్వహించి పంపేశారు. బాలకోటిరెడ్డి గతంలో అతని అక్క ఊరు ముండ్లమూరులో క్రికెట్ ఆడుతూ నెలకొన్న వివాదంలో ఒక వ్యక్తిని ఆవేశంతో బ్యాట్‌తో దాడి చేసిన కేసులో బాలకోటిరెడ్డి నిందితుడు.

లారీ ఢీకొని బిచ్చగాడు మృతి

మేదరమెట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రప్రదేశ్) : నార్కెట్‌పల్లి - మేదరమెట్ల రాష్ట్రీయ రహదారిలో వెళ్తున్న లారీ మేదరమెట్ల పైలాన్ ఫ్లైఓవర్ సెంటర్‌లో బిచ్చగాడిని ఢీకొంది. బుధవారం హైదరాబాద్ నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ ఫ్లైవోవర్ వద్ద అకస్మాత్తుగా అడ్డం వచ్చి గుర్తుతెలియని బిచ్చగాడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో ఒంగోలు తరలించారు. అప్పటికే అతను చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఎస్ఐ మహ్మద్ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు అన్నారు. పట్టణంలోని భవానీ సెంటర్‌లో బుధవారం రాత్రి సీఐ సుబ్బరాజు తనిఖీలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రతి రోజు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామని తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఖాదర్‌బాషా అన్నారు. హెల్మెట్ వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ద్విచక్రవాహన చోదకులు బుధవారం పట్టణంలోని మేరమెట్ల రోడ్డులో అవగాహన కలిగించారు. ప్రధానంగా ప్రమాదం జరిగిన సమయంలో హెల్మెట్ ధరించడం ద్వారా తలకు గాయాలు కాకుండా బయట పడవచ్చన్నారు. దీంతో ప్రాణాపాయం నుండి బయట పడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనం నడపాలన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుతూ పట్టుబడితే అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు.


హెల్మెట్‌తో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా


పుస్తకావిష్కరణలో పాల్గొన్న రచయిత రాజా, ఎన్‌యూ వర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ సాంబశివరావు, పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి

ద్రోణాదుల గ్రామ చరిత్ర పుస్తకావిష్కరణ

మార్టూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని గోపు లక్ష్మీనారాయణ తులశమ్మ కల్యాణ మండపంలో బుధవారం పెంటేల రాజా రచించిన ద్రోణాదుల గ్రామ చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు విశ్రాంత లెక్చరర్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు చేతుల మీదగా, మరి కొంతమంది అతిథుల సమక్షంలో పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మూడువేల సంవత్సరాల ద్రోణాదుల గ్రామ చరిత్రను రచయిత రాజా 200 పేజీలలో సమకూర్చడం అభినందనీయమన్నారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన శాశన పరిశోధకులు జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ గ్రామంలో వెయ్యి సంవత్సరాలు కిందటే ద్రోణాదులమ్మ లాంటి గ్రామ దేవతలకు, చెన్నకేశవ, శివాలయం,రాయాలయాల నిర్మాణం జరిగినట్లు రచయిత తన పుస్తకంలో రాయడం అభినందనీయమన్నారు. అనంతరం పెంటేల రాజాను అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో నాగబోయిన రంగారావు,అమరా రాజమోహనరావు, పెంటేల జగన్మోహనరావు, ఏపీ హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి, సుబ్బయ్య, రాజశేఖర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మద్దతు ధరకు పంటలు అమ్ముకోవాలి

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరకు రైతులు పంటలను అమ్ముకోవాలని వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్ అన్నారు. బుధవారం చీరాల, వేటపాలెం, చినగంజాం మం డలాల పరిధిలోని పొలంబడి 2024-25 కార్యక్రమంలో భాగంగా సీడింగ్ అధికారి రాధాకృష్ణ, రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో ప్రదీప్ హాజరై విత్తనాల నమూనాలను సేకరించారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన భూసార పత్రాలను రైతులకు అందజేశారు. మొక్కజొన్న రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.


మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఎంఏవో

కూలీల సంఖ్య పెంచాలి

బల్లికురవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచేలా సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం జరిగింది. వలసలు పోకుండా కూలీలకు గ్రామాలలోనే పనులు కల్పించాలన్నారు. నీటి తొట్లను వెంటనే నిర్మించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏపీవో రమాదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో గ్రానైట్ వ్యర్థాలు వేస్తే చర్యలు

- మల్లాయపాలెంలో ప్రభుత్వ భూములను పరిశీలించిన ఆర్డీవో, మైనింగ్ ఏడీ


మల్లాయపాలెంలో గ్రానైట్ క్వారీల వద్ద రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్

బల్లికురవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాల్లో గ్రానైట్ వ్యర్థాలను వేస్తే చర్యలు తప్పవు అని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు హెచ్చరించారు. బుధవారం మండలంలోని మల్లాయపాలెం గ్రామ పరిధిలో ఉన్న పలు గ్రానైట్ క్వారీలు వేసి డంపింగ్‌లను ఆర్డీవో బాపట్ల మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ పరిశీలించారు. మల్లాయపాలెం గ్రామానికి చెందిన లేమాటి హనుమంతురావు అనే వ్యక్తి కాలవ కట్టను పూడ్చి వ్యర్థాలు వేశారని హైకోర్టు ద్వారా ఫిర్యాదులు చేయగా అధికారులు డంపింగ్ వేసిన స్థలాలను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలను రైతులను ఇబ్బందులు చేస్తే క్వారీల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తిస్థాయి పరిశీలనతో త్వరలో నివేదిక తయారు చేస్తామని వారు తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రవినాయక్, మైనింగ్, రెవెన్యూ సర్వేయర్లు నాగలక్ష్మి, కిషోర్‌బాబు, చంద్ర పాల్గొన్నారు.

ఆర్ణా గ్రానైట్ క్వారీని మరో సారి పరిశీలించిన అధికారులు

మల్లాయపాలెం గ్రామంలో ఉన్న ఆర్ణా గ్రానైట్ క్వారీని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ మరో మారు పరిశీలించారు. దారిని ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు గతంలో ఒక సారి అధికారులు పరిశీలించారు. మరలా రికార్డులను పరిశీలించేందుకు అధికారులు క్వారీని తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రికార్డుల ప్రకారం ఎలా ఉంటే అలా ముందుకు వెళతామని స్పష్టం చేశారు.



రేపు యోగ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

బల్లికురవ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూకట్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగ్గుల కొండ యోగ ప్రసన్నాంజనేయస్వామి వారి వార్షిక తిరునాళ్ల శుక్రవారం జరుగనున్నట్లు ఆలయ ధర్మకర్త తాళ్ల శివశంకర్‌రెడ్డి తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశామని ఆలయ నిర్వాహక కమిటీ తెలిపారు. భక్తుల కోసం అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు.

రాతి మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి చినగంజాంకు చెందిన శంకరమంచి హనుమంతరావు దంపతులు బుధవారం రూ.1,00,011 విరాళాన్ని ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. అనంతరం హనుమంతరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న దాత

13న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

అద్దంకిటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఈ నెల 13వ తేది జరుగుతుందని అద్దంకి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి బుధవారం ఒ క ప్రకటన ద్వారా తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు ఇంటర్ మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ధరకాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత వెబ్ సైట్‌లో హాల్ టిక్కెట్‌లను డౌన్ లోడ్ చేసుకోవాలని, పరీక్ష కేంద్రాలనికి హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైన గుర్తింపు కార్డు ఆధార్ వంటిది వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

ఉచిత చలివేంద్రాన్ని వినియోగించుకోవాలి

ఈవోఆర్డీ సత్యనారాయణ



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

నూతలపాడు (పర్చూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఆవోఆర్డీ కొసనా సత్యనారాయణ కోరారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నయ్య, కార్యదర్శి కృష్ణమోహన్, టీడీపీ నాయకులు విన్నకోట సతీష్, శ్రీహరి, రామ సుబ్బారావు, శేఖర్, గణేష్, వాసు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

28 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఇంకొల్లు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సంతరావూరు నుంచి అద్దంకి తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలను పోలీసులు మండల పరిధిలోని గొల్లపాలెం రోడ్డులో పట్టుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. సుమారు 50 కిలోలు కలిగిన 28 బస్తాలను లగేజి ఆటోలో తరలిస్తుండగా గుర్తించి సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఆటోలో పట్టుబడిన రేషన్ బియ్యం